

నెల్లూరు : వెంకటేశ్వరపురంలో పునాదుల దశలోనే ఆగిన జగనన్న ఇళ్లు

వైసీపీ అధినేత జగన్ రెడ్డి నవరత్నాలలో పేదలందరికీ పక్కా ఇళ్లు ముఖ్యమైనది. ఈ హామీతో పేదలంతా సంబరపడిపోయారు. కానీ జరిగిందేమిటి!?. వైసీపీ పెద్దల మాటలు నమ్మి ఇళ్లు కట్టిచ్చే బాధ్యతను కాంట్రాక్టర్ల చేతికి అప్పగించిన వేలాది మంది లబ్ధిదారులు నిలువునా మునిగిపోయారు. అటు ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులు, ఇటు లబ్ధిదారులు ఇచ్చిన డబ్బులు మొత్తం దిగమింగేసి కాంట్రాక్టర్లు చల్లగా జారుకున్నారు. మంజూరైన ఇల్లు మొండిగోడలకే పరిమితం కాగా ఇంటిమీద ప్రభుత్వం మంజూరు చేసిన 1.80 లక్షలు మాత్రం అప్పుగా మిగిలిపోయింది. దీనికితోడు డ్వాక్రా సంఘంలో రుణం పొందో లేదా బయట అప్పు చేసి కాంట్రాక్టరుకు చెల్లించిన రూ.40వేలు నష్టపోయారు. వీటన్నిటికి కన్నా బాధాకరం ఏమంటే ఇంటి నిర్మాణం పూర్తి కాని లబ్ధిదారులకు ఇక నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వరు. అంతేకాదు భవిష్యత్తులో వీరికి ఇళ్లు వచ్చే అవకాశమూ లేదు. జిల్లాలో ఇలాంటి అభాగ్యుల సంఖ్య వేలల్లోనే ఉంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

గూడు.. గోడు!

- జగనన్న ఇళ్లు.. కాంట్రాక్టర్ల భోజ్యం
- ఇళ్లు కట్టకనే రూ.246.98 కోట్లు దండేశారు!
- లబోదిబోమంటున్న 25వేల మంది లబ్ధిదారులు
- ఇప్పటి ఇళ్లు పూర్తికావు.. భవిష్యత్తులో మరో ఇల్లు రాదు!
- పేదల సొమ్ము దిగమింగి దర్జాగా తీరుగుతున్న అక్రమార్కులు
- రక్షణ కోసం 'కూటమి' పంచన చేరిన వైనం

వివిధ కారణాలతో జగనన్న పక్కా ఇళ్లను నిర్మించుకోవడానికి పేదలు ముందుకు రాలేదు. ఈ పరిస్థితి అధిగమించకుంటే ఎన్నికల నాటికి ప్రమాదమన్న ఉద్దేశంతో చివరి సంవత్సరంలో లబ్ధిదారులను ఇళ్ల నిర్మాణానికి బలవంతం పెట్టారు. ఆ క్రమంలో వేగంగా ఇళ్ల నిర్మించడానికి కాంట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. ఇలా జిల్లావ్యాప్తంగా 180 ఏజెన్సీలను రంగంలోకి దించి, 29,238 ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఇంటి బిల్లులు కాంట్రాక్టర్లకే అందేలా ఏర్పాటు చేశారు. ఇంకేముంది కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారు కానీ నిర్మాణాలు మాత్రం పూర్తి చేయలేదు. 29,238 ఇళ్లలో కేవలం 6,017 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన వాటిని అసంపూర్తిగా వదిలేశారు. ఇలా అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాల్లో 80 శాతం వరకు పునాదుల దశ దాటలేదు. అంటే కాంట్రాక్టర్లు పునాదులు వేసి బిల్లులు మొత్తం భోంచేశారు. వీరికి కొంతమంది హౌసింగ్ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందజేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పునాదుల దశ దాటని ఇళ్లకు మాత్రం మాత్రం రూ.246.98 కోట్లు డ్రా చేసుకున్నారు.



ఈయన పేరు బెల్లంకొండ పవన్ కుమార్. వైసీపీ ప్రభుత్వంలో నివాస స్థలం మంజూరవగా ఇంటి నిర్మాణానికి ఉపక్రమించారు. ప్రభుత్వం ఇచ్చిన రూ1.8 లక్షలు సరిపోక తన వద్ద ఉన్న కొద్దోగొప్పో నగదుతో కొంతమేర పనులు చేశాడు. బిల్లులు పూర్తయినా నిర్మాణం పూర్తి కాలేదు. కూలి పనులే జీవనాధారమైన ఈయనకు ఆర్థిక స్థోమత సరిపోక ఏంచేయాలో తోచని పరిస్థితిలో ఉండిపోయాడు.

దండుకున్నారు.. వెళ్లిపోయారు!



జగనన్న ఇల్లు నిర్మాణం చేయాలంటే ముందుగా డబ్బు కట్టాల్సిందేనన్నారు. దీంతో అప్పుచేసి రూ.20వేలు కట్టాను. రోజులు గడుస్తున్నాయి కానీ పనులు మాత్రం పూర్తి చేయలేదు డబ్బు తీసుకున్న కాంట్రాక్టర్ ఎక్కడున్నారో తెలియదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఇంటిని పూర్తిచేసి అప్పగించాలి.

- ఖాదర్ ఉన్నీసా, జనార్దన్‌రెడ్డికాలనీ (నెల్లూరు)

ఇంతవరకు ఇల్లు అప్పగించలేదు



జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఇప్పటికి రెండేళ్లు కావస్తోంది. ఇంటికి అదనంగా రేకులు, పూతపనులు చేస్తామని చెప్పి కాంట్రాక్టర్ మా వద్ద రూ.10 వేలు తీసుకొన్నారు. ఇప్పుడు పూర్తి చేయకుండా నిలిపివేశారు. అద్దె ఇంటిలోనే ఉంటున్నాము. ఇప్పటికైనా ఇంటి నిర్మాణం పూర్తిచేసి మాకు అప్పగించాలి.

- గంగమ్మ, వెంకటేశ్వరపురం (నెల్లూరు)

● భవిష్యత్తులో కష్టమే!

పోనీ ఇంత నష్టపోయినా భవిష్యత్తులో వీరికి ఇళ్లు వచ్చే అవకాశం ఉందా అంటే ప్రస్తుత నిబంధనల ప్రకారం అదీనూ లేదు. ఇంటి పట్టాలు అన్నీ ఆన్‌లైన్‌లో రికార్డు అయ్యాయి. రికార్డుపరంగా లబ్ధిదారుడికి మరోసారి ఇంటి పట్టా ఇవ్వడానికి సాధ్యపడదు. అలాగే పక్కా ఇళ్ల మంజూరు కూడా ఆన్‌లైన్‌లో రికార్డు అవుతుంది. ఒకసారి పక్కా ఇళ్లు మంజూరై ఒక బిల్లు విడుదల అయినా కొత్తగా మరో ఇల్లు ఇచ్చే అవకాశం లేదు. ఇలా సుమారు 25వేల మంది పేదలు అన్ని విధాలా నష్టపోయారు.

● అదనంగా మరో రూ.40వేలు

ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోదని, మరో రూ.40వేలు అదనంగా లబ్ధిదారుడు చెల్లిస్తే కాంట్రాక్టర్లకు గిట్టుబాటు అవుతుందని అప్పటి వైసీపీ నాయకులు లెక్కలు గట్టారు. ఆ మేరకు ప్రతి లబ్ధిదారుడి నుంచి అదనంగా 40వేలు కాంట్రాక్టరుకు ఇప్పించారు. ఈ నగదు కోసం డ్వాక్రా సంఘ సభ్యులైన లబ్ధిదారులకు ఆ సంఘం నుంచి ప్రత్యేకంగా అప్పు మంజూరు చేయించారు. రుణాలకు అర్హతలేని మహిళలు ఇంట్లో బంగారం తాకట్టు పెట్టి లేదా, అధిక వడ్డీకి అప్పులు చేసి మరీ కాంట్రాక్టర్లకు పోశారు. ఇప్పుడు ఇళ్లు కట్టకపోగా అప్పులపాలయ్యారు.

● కూటమి ప్రభుత్వం స్పందించాలి

సొంత ఇల్లు అనేది ప్రతి పేదవాడి కల. అది సాకారం చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అయితే గత ప్రభుత్వంలో అధికారుల తప్పిదాలు, స్థానిక వైసీపీ నాయకుల అత్యుత్సాహం, పలువురి అవినీతి ఇలా కారణాలేమైనా పేదలకు మాత్రం నష్టం జరిగిపోయింది. ఇళ్ల నిర్మాణాల పేరుతో డబ్బులు తిన్న ఘనులు ప్రస్తుతం కూటమి జెండాల మాటున రక్షణ పొందుతున్నారు. దర్జాగా తిరుగుతున్నారు. తప్పుడు బిల్లులు చేసి అవినీతికి సహకరించిన అధికారులు తాపీగా ఉన్నారు. అన్ని విధాలా నష్టపోయింది పేదలే. ఈ పేదల విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. మానవతా దృక్పథంతో వీరికి న్యాయం చేయాలి. నిబంధనలు సడలిస్తారో, డబ్బులు తిన్న కాంట్రాక్టర్ల చేత కక్కించి న్యాయం చేస్తారో! ఏవిధంగానైనా పేదలకు న్యాయం జరగాలి. తరతరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కలకు తమను శాశ్వతంగా దూరం కానివ్వకుండా న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అల్లూరు : శ్లాబు దశలోనే నిలిచిన ఇంటి నిర్మాణం



ర్యాలీలో పాల్గొన్న యువత

జయహో ఛత్రపతి

ఘనంగా శివాజీ జయంతి ● కదం తొక్కిన హిందూ సంఘాలు



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసిన మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 496వ జయంతిని బుధవారం నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. బీజేపీ అనుబంధ మోర్చాల రాష్ట్ర ఇన్‌చార్జి పీ సురేందర్‌రెడ్డి దీనిని ప్రారంభించారు. తొలుత మరాఠా మిత్రమండలి ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు చేశారు. శివాజీ విగ్రహాన్ని గజమాలతో అలంకరించి నివాళులర్పించారు. సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ శివాజీ పోరాటమే భారత స్వాతంత్ర్య సంగ్రామానికి స్ఫూర్తి అన్నారు. విదేశీ ముష్కరులు భారతదేశాన్ని కొల్లగొడుతుంటే తల్లి జిజియా బాయి, తుల్జాపూర్ భవానీ మాత ఆశీస్సులతో వీరోచితంగా పోరాడారని కొనియాడారు. యువత శివాజీ ఆశయాలను, ఆదర్శాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లలో జరిగే ఆయన 500వ జయంతిని అన్నీ ప్రాంత్రాల్లో ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, మారాఠా మిత్ర మండలి అధ్యక్షుడు దేవ దాస్ జాదవ్, సందీప్ పాండురంగ, సంఘ సేవకుడు ఎన్‌వీ సుబ్బారావు, శివాజీ సెంటర్ ప్రముఖులు కేవీ సుబ్రహ్మణ్యం, పీ సత్యనాగేశ్వరరావు, బీ ఎస్ రంగరాజన్, మధుసూదన్, బాలసుబ్రహ్మణ్యం, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శివాజీ జయంత్యుత్సవంలో భాగంగా నిర్వహించిన చైతన్యర్యాలీ వైభవంగా జరిగింది. దేశభక్తి నినాదాలతో, కాషాయ జెండాలతో హిందూ సంఘాలు కదం తొక్కాయి. ఈ ర్యాలీ వైఎంసీఏ గ్రౌండ్ నుంచి ట్రంకురోడ్డు మీదుగా నర్తకిసెంటర్‌కు అక్కడి నుంచి మళ్లీ వైఎంసీఏ గ్రౌండ్‌కు చేరింది. చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, అనుబంధ సంఘాలు, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు. శివాజీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, కన్వీనర్ అశోక్‌నాయుడు, కార్యదర్శి మధురెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

ఐటీడీఏ పీవోగా మల్లికార్జునరెడ్డి

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారిగా మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు అదనపు డైరెక్టర్‌గా పదోన్నతి కలిగింది. ఈ నేపథ్యంలో జిల్లా ఐటీడీఏ పీఓగా నియమిస్తూ కూటమి ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

24న పీఎం కిసాన్ విడుదల

నెల్లూరు (వ్యవసాయం) : పెట్టుబడి సాయంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా అందిస్తున్న సాయాన్ని 24వ తేదీన రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. 2024-25 సంవత్సరానికి గాను 19వ విడత నిధులు జిల్లావ్యాప్తంగా 1.68 లక్షల మంది రైతులకు అందనుంది. రూ.2వేల చొప్పున మొత్తం రూ.33.52 కోట్లు రైతుల ఖాతాల్లో ప్రధాని నరేంద్ర మోదీ జమ చేయనున్నారు.

సంగంలో జీబీఎస్ అనుమానితుడు

● వ్యాధి లక్షణాలతో జీజీహెచ్‌లో చేరిక ● నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు



అరవపాళెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సంగం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కలకలం రేపుతున్న గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) లక్షణాలతో సంగం మండలం జెండాదిబ్బ పంచాయతీలోని పుట్టవారి కండ్రిగలో ఓ వ్యక్తి నెల్లూరులోని జీజీహెచ్‌లో చేరారుడ. ఆ మేరకు బాధితుడికి రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు వైద్యాధికారులు శ్రీనివాసులురెడ్డి, అశోక్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి వైద్య, పంచాయతీ సిబ్బందితో గ్రామంలో పారిశుద్య కార్యక్రమాలు చేపట్టారు. ఇంటింటికి వెళ్లి లార్వా, ఫీవర్ సర్వే ముమ్మరంగా చేస్తున్నారు. జీబీఎస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారివెంట సర్పంచ్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

గెలిచినా.. ఓడుతున్నారు!

- న్యాయపరంగా భూమి ఇవ్వడంలో తీవ్ర జాప్యం
- జిల్లాలో వంద కుటుంబాలకు తీరని వేదన
- ముప్పుతిప్పలు పెడుతున్న రెవెన్యూ శాఖ



దేశ సరిహద్దులో మన సైనికుల పోరాటం మాటల్లో చెప్పలేం. మన దేశంలోకి శత్రువులు చొరబడ కుండా నిత్యం పహారా కాస్తూ తమ ప్రాణాలను సైతం ఫణంగా పెడతారు. ఎముకలు కొరికే మంచు కొండల్లోనూ శత్రుసైన్యానికి ఎదురొడ్డి పోరాడి విజేతగా నిలుస్తారు. అలాంటి సైనికులు ఉద్యోగ విరమణ పొంది, ఎంతో గర్వంగా సొంతూళ్లకు చేరుకుంటారు. కానీ ఇక్కడ అధికారులు వ్యవహరిస్తున్న తీరు మాజీ సైనికులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తోంది. ప్రభుత్వ ఫలాలను వారి దరి చేర్చాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 'జీవనాధారం చూపించండి మహా ప్రభో..' అంటూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారుల్లో మాత్రం కనికరం ఉండటం లేదు.

జిల్లాలో మాజీ సైనికోద్యోగ కుటుంబాలు సుమారు వంద వరకూ ఉన్నాయి. 'మాకు భూమిని కేటాయించి జీవనాధారం చూపించండయ్యా..' అంటూ రెవెన్యూ సిబ్బంది చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాయి. దేశ సరిహద్దులో ప్రాణాలకు తెగించి శత్రువులతో పోరాటం చేసి వచ్చిన సైనికులు.. తమ ఫలాలను సాధించుకోవడంలో మాత్రం విజయం సాధించలేకపోతున్నారు. అక్కడ శత్రువులతో పోరాటం చేసిన దేశభక్తులు ఇక్కడ రెవెన్యూ వ్యవస్థతో పోరాటం చేయలేకపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాజీ సైనిక ఉద్యోగులకు ఐదెకరాల సాగు భూమి ఇవ్వాలి. రక్షణ వ్యవస్థలో పనిచేసి వచ్చాక వారికి మరో పని తెలియదు కాబట్టి వారు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తారన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. అంతటి గొప్ప వ్యక్తులకు జిల్లాలో మాత్రం న్యాయం జరగడం లేదు. జిల్లాలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా అందులో నుంచి ఐదెకరాలను మాజీ సైనికులకు ఇవ్వడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. తహసీల్దార్ కార్యాలయాల స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, జిల్లాస్థాయిలో పట్టించుకోకపోతుండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది.

కాదా అన్నది వారు నిర్ధారించుకోవాలి. జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి అన్ని ఆధారాలు తీసుకొని సదరు వ్యక్తికి భూమిని చూపించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంటుంది. కానీ ఇందుకు భిన్నంగా ఎక్కడ ఖాళీ భూమి ఉందో మీరే చూసుకొని రండి.. అంటూ కింది స్థాయి సిబ్బంది చెబుతున్నారు. ఎక్కడ భూమి ఉందన్న విషయం మాజీ సైనికులకు ఎలా తెలుస్తుంది? అని ప్రశ్నిస్తే మాత్రం రెవెన్యూ ఉద్యోగుల నుంచి సమాధానం రావడం లేదు. ఒక వేళ తంటాలు పడి ఫలానా చోట భూమి ఖాళీగా ఉందని ఎక్స్‌సర్వీస్‌మెన్‌లు తెలుసుకుని వచ్చినా ఫైల్ కదలడానికి అనేక కొర్రీలు పడుతున్నాయి. అన్ని చేరి ఆ ఫైల్ ఆర్డీవో కార్యాలయానికో లేక కలెక్టరేట్‌కో వస్తే.. ఇక్కడ దానిని పట్టుకోవడం చాలా కష్టంగా మారుతోందని ఎక్స్‌సర్వీస్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది సమాధానం కూడా చాలా నిర్లక్ష్యంగా ఉంటోందని వాపోతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరి ఫైల్ ఏ స్థాయిలో ఉందో కూడా తెలియడం లేదని చెబుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు జోక్యం చేసుకోవాల్సిన అవశ్యకత ఏర్పడింది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

● మాజీ సైనిక ఉద్యోగులకు తప్పని తిప్పలు

కావలికి చెందిన ఓ వ్యక్తి సుమారు 20 ఏళ్ల పాటు ఆర్మీలో సేవలందించారు. పదవీ విరమణ పొందాక న్యాయపరంగా తనకు ఇవ్వాల్సిన భూమి కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగారు. కానీ ఎవరూ కనికరించలేదు. చివరకు డబ్బులు ఖర్చు చేస్తే గానీ తనకు న్యాయం దక్కదని గ్రహించిన ఆ మాజీ సైనికోద్యోగి ఏఎస్‌పేట మండలంలో భూమిని చూసుకున్నారు. అయినా భూమి దక్కలేదు. సుమారు ఇరవై ఏళ్లపాటు రెవెన్యూ వ్యవస్థతో పోరాడి గతేడాది తనువు చాలించారు. ఇప్పుడు ఆయన కుటుంబ సభ్యులు తమకు భూమిని కేటాయించి ఆదుకోవాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నెల్లూరుకు చెందిన మరో మాజీ సైనికోద్యోగి ఆరేళ్ల క్రితం పదవీ విరమణ చేసి భూమి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. రెవెన్యూ సిబ్బంది భూమి చూపించాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా మీరే భూమి చూసుకోండి అంటూ ఆ మాజీ సైనికో ద్యోగితో ఆడుకుం టున్నారు. ఉన్నతా ధికారులకు కూడా అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందని సదరు ఎక్స్ సర్వీస్‌మన్ ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.



● కలెక్టర్ గారూ.. కనికరించండయ్యా!

మట్టెం వెంకటేశ్వర్లు అనే మాజీ సైనికోద్యోగి తన హక్కు కోసం ఇరవై ఏళ్ల పాటు పోరాటం చేసి చివరకు ఫలితం సాధించకుండానే తనువు చాలించిన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగిస్తోంది. ఆఖరుకు హైకోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నా ఈ ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇప్పటికీ న్యాయం జరగలేదంటే జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎక్స్ సర్వీస్ మెన్లకు భూమిని కేటాయించే విషయంలో రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉంటోంది. ఒక వ్యక్తి భూమి కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాక అతను అర్హుడా



రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలు

సర్వర్ డౌన్

● ఆగిన రిజిస్ట్రేషన్లు ● కార్యాలయం వద్ద జనం పడిగాపులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ బుధవారం మొరాయించడంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు నగరంలోని ప్రధాన కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో వారు వేచి ఉండలేక, బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ బుధవారం సప్తమితిథి (మంచిరోజు) కావడంతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. సర్వర్ మొరాయించడంతో ప్రక్రియ ఆగిపోయింది. నగరంలోని ప్రధాన కార్యాలయంలో ప్రతిరోజూ 10 నుంచి 40 వరకు దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. మంచితిథి కావడంతో వందకుపైగా రిజిస్ట్రేషన్ల కోసం జనం వచ్చారు. భూములు, స్థలాల మార్కెట్ విలువలు ఇటీవల పెరగడంతో రిజిస్ట్రేషన్ చేసుకునేవారి సంఖ్య తగ్గింది. దీనికితోడు తరచూ సర్వర్ మొరాయింపుతో ఆ శాఖ ఆదాయానికి గండి పడుతోంది. రిజిస్ట్రేషన్ల కోసం నగదు చెల్లించి గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడడంతోవారు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందే రిజిస్ట్రేషన్ ఫీజు నగదు కట్టించుకుని, రిజిస్ట్రేషన్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. రిజిస్ట్రేషన్ చేసేవారు, చేయించుకునే వారితోపాటు సాక్ష్యులు కూడా వచ్చారు. సర్వర్ సమస్యతో వారు కూడా విసిరి వేసారిపోయారు. తరచూ మొరాయిస్తున్న సర్వర్ విషయంలో ఆశాఖ ఉన్నతాకారులు సరైన చర్యలు తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సర్వర్ సమస్యను పరిష్కరించి, రిజిస్ట్రేషన్లు సకాలంలో జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



ఉర్దూ పాఠశాలను విలీనం చేయొద్దు

లింగసముద్రం మండలం పెదపవని ముస్లిం కాలనీలో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలోని 6,7,8 తరగతులను స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విలీనం చేయవద్దని మాజీ సర్పంచు సయ్యద్ నాయబ్‌రసూల్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ షేక్ ఉబేదుల్లా, పాఠశాల కమిటీ సభ్యులు, తలిదండ్రులు, బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, మండలంలోని ఏకైక ఉర్దూ పాఠశాలను విలీనం చేస్తూ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తీసుకోవా లని డిమాండ్ చేశారు. కాలనీలో సుమారు 400 ముస్లిం కుటుంబాలు ఉన్నాయని, తమ పిల్లలంతా చదువుకోవడానికి మండలంలో ఉన్న ఏకైక ఉర్దూ పాఠశాల ఇదేనని చెప్పారు.దీన్ని విలీనం చేస్తే తమ పిల్లలు డ్రాప్ అవుట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. యథావిధజగా ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

-లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

మద్దతు ధర కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు

బుచ్చిరెడ్డిపాళెం : ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని జేసీ కే. కార్తీక్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని రేబాలలో రైతు సేవా కేంద్రాన్ని ఆర్ఎస్‌కే జిల్లా కోఆపరేటివ్ అధికారి గుర్రప్పతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, వీఏఏలు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మద్యం దుకాణం తెరవనీయం!

స్థానిక గిడ్డంగివారి వీధిలో మద్యం దుకాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో తెరవనీయం అంటూ బుధవారం సాయంత్రం మహిళలు ఆందోళన చేశారు. కలువాయి మండలానికి గీత కార్మికుల కోటాలో కొత్తగా మంజూరైన మద్యం దుకాణాన్ని చిలుకూరి ప్రసాద్ ఇంట్లో తెరిచేందుకు నిర్వాహకులు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే ఇరుకుగా ఉండే మా వీధిలో మద్యం దుకాణం వద్దు అంటూ ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ అధికారులకు కాలనీ వాసులు వినతిపత్రాలు అందజేశారు. ఈనేపథ్యంలో బుధవారం సాయంత్రం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్న గది ముందు మహిళలు ఇక్కడ మద్యం దుకాణం పెట్టవద్దు అంటూ ఆందోళన చేశారు.

-- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

కలంకారీ... పురాతనమైన కళ. సహజ సిద్ధమైన రంగులతో వస్త్రాలపై పురాణ, ఇతిహాసాలను హృద్యంగా దృశ్య రూపంలో చెప్పే అరుదైన విద్య. ఈ కళతో రూపొందించిన వస్త్రాలతో దేవాలయాల్లోని రథాలను తీర్చి దిద్దుతారు. ప్రభలను తయారు చేస్తుంటారు. రాజుల కాలంలో ఎక్కువగా కలంకారీ వస్త్రాలే వినియోగించేవారు. రాజప్రాసాదాల్లో రాచరికపు ఠీవిని ఇవి మరింత ద్విగుణీకృతం చేసేవి. కాలక్రమేణ ఈ విద్యలో ప్రావీణ్యం ఉన్న కళాకారులు తగ్గిపోయారు. ప్రస్తుతం దేశంలోని అనేక ప్రాంతాల్లో కలంకారీ పేరుతో బ్లాక్ ప్రింటింగ్‌తో చేసిన వస్త్రాలు విక్రయిస్తున్నారు. కానీ, నిన్నటితరం అసలు సిసలైన కలంకారీ కళాకారుడు విన్నకోట వీర రాఘవయ్య. వారసత్వంగా అబ్బిన కళకు తన సృజనను జోడించి కళ్లు చెదిరే కళాఖండాలను సజీవంగా సాక్షాత్కరిస్తున్నారు. స్వతహాగా తయారు చేసుకున్న రంగులతో ఎందరివో చరిత్రలకు చిత్రరూపమిచ్చి కింగ్ ఆఫ్ కలంకారీగా నిలుస్తున్నారు.



అద్దంకి రామలింగేశ్వరాలయం రథానికి వీరరాఘవయ్య చేసిన కళంకారి వస్త్రం

ప్రభళ రాఘవ

- అరుదైన కలంకారీ కళాకారుడు వీరరాఘవయ్య
- ఆలయాలకు ప్రభల తయారీలో దిట్ట
- సహజసిద్ధ రంగులతో రూపకల్పన
- 50 ఏళ్లుగా ఎన్నో కళాఖండాలకు జీవం
- ఢిల్లీ మ్యూజియంలో గంగచరిత్ర ప్రభ
- మలి వయసులో ఒంటరితనం
- వృద్ధాప్య పింఛనుతో జీవనం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇనమనమెల్లూరు గ్రామంలో విన్నకోట ఆదిశేషయ్య, చిన్న కోటమ్మకు 1949లో వీరరాఘవయ్య జన్మించారు. తండ్రి కలంకారీ కళాకా రుడు కావడంతో బాల్యం నుంచే ఈ కళపై మక్కువ పెంచుకున్నారు. ఐదో తరగతి వరకే చదువుకున్న రాఘవయ్య ఆ తర్వాత తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ కలంకారీలో మెలకువలు నేర్చుకున్నారు. వృత్తి రీత్యా 1972లో కుటుంబంతో నెల్లూరుకు వచ్చేశారు. కొంతకాలం నవాబుపేటలో కాపురం ఉన్నారు. అనంతరం వెంకటేశ్వరపురంలో స్థిరపడ్డారు. తండ్రి మరణానంతరం కలంకారీ కళనే వృత్తిగా, జీవనోపాధిగా మార్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అనేక దేవాలయాల రథాలకు ప్రభలను తయా రు చేశారు. గంగ పటములు, కాటమరాజు, మనుమసిద్దిరాజుల చరిత్రలు చిత్ర రూపంలో చెప్పడంతో దిట్టగా గుర్తింపు పొందారు. సీతారాముల కల్యాణం, సంపూర్ణ రామాయణం, శ్రీకృష్ణ లీలలు, మనుచరిత్ర... ఇలా అనేక పురాణ, ఇతిహాస గాధలతో ప్రభలను తయారు చేసి మంచి పేరు తెచ్చుకొన్నారు. వీరరాఘవయ్య ప్రాణం పోసిన గంగచరిత్ర, మనుచరిత్రల ప్రభల వస్త్రం ఇప్పటికీ ఢిల్లీ మ్యూజియంలో ఉండటం విశేషం. ఇలా గత 50 సంవ త్సరాలుగా కలంకారీ కళాకారుడిగా ఎన్నో అద్భుత చిత్రాలను ఆవిష్కరించారు. దాదాపు 15 ఏళ్ల డీఆర్‌డీఏ ద్వారా వేలాది మంది మహిళ లకు కలంకారీ కళలో శిక్షణ ఇచ్చారు.



కాటమరాజు చరిత్ర చెబుతున్న కలంకారీ కళాఖండం

చాందినీ వస్త్రంపై రాఘవయ్య రూపొందించిన సీతారాముల కల్యాణ ఘట్టాలు





అన్నీ చేతితోనే...

అన్నీ రంగాల్లో యాంత్రీకరణ పెరిగిపోయి నాణ్యత తగ్గిపోతున్న రోజుల్లో విన్నకోట వీరరాఘవయ్య కలంకారీ వస్త్రాల తయారీని చేతితోనే చేస్తు న్నారు. దీనికి అవసరమైన రంగులను కూడా తానే సొంతంగా తయారు చేసుకుంటారు. ముందుగా వస్త్రంపై బొమ్మలు గీసుకొని అనంతరం కలంకారీ ఆర్ట్ వేస్తారు. ఇలా ఆయన తయారు చేసిన రథం ప్రభలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అనేక దేవాలయాల్లో నేటికీ దర్శనమిస్తున్నాయి. కొటప్పకొండ, శ్రీకాళహస్తి వంటి ప్రముఖ దేవస్థానాలు, బ్రహ్మంగారి మఠం, ఉప్పుకొండూరు ఆలయాలతోపాటు అనేక దేవాలయాలకు ప్రభలు, గంగపటాలను అందించారు. సహజ సిద్ధమైన రంగులు వాడటం, చిత్రాలు సజీవంగా దర్శనమిస్తుండటంతో ఇప్పటికీ రాఘవయ్యకు ఆర్డర్లు వస్తున్నాయి. అయితే వృద్ధాప్య కారణంగా శరీరం పట్టుతప్పడం, ఈ కళను నేర్చుకునే వారసులు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.



కృష్ణలీల చిత్రం...

ఇప్పటికీ ఆర్డర్లు వస్తున్నాయి



వయసు పెరిగిపోయి ఒంటిలో శక్తి తగ్గిపోవడంతో గతంలో మాదిరిగా పని చేయలేకున్నాను. ఇప్పటికీ రెండు రాష్ట్రాల నుంచి అనేక దేవాలయాల వాళ్ల ప్రభలు, గంగపటముల ఆర్డర్లు ఇస్తున్నారు. భార్య చనిపోయింది. ఉన్న ఒక్క కూతురికి పెళ్లి చేసి అత్తంటికి పంపించాను. ప్రస్తుతం వెంకటే శ్వరపురంలోని టిడ్కో ఇళ్లలో ఉంటున్నాను. ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పింఛనుతో జీవనం సాగిస్తున్నాను.

- వీరరాఘవయ్య

ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ఇస్తిమాకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు
- అధికారులకు ఎమ్మెల్యే ప్రశాంతి ఆదేశం

కొడవలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగడిచెలిక వద్ద ఈ నెల 22 నుంచి జరగనున్న తబ్లిగ్ జమాత్ రాష్ట్రస్థాయి ఇస్తిమాకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 2లక్షల మందికిపైగా భక్తులు పాల్గొనే ఇస్తిమా మైదానంలో టెంట్లు, స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్తిమా నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఫైర్, శానిటేషన్, పోలీసు తదితర శాఖల అధికారులను ఆదేశించారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇస్తిమా గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఓ స్టాల్‌ను ఏర్పాటు చేసి భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తామన్నారు. ఇస్తిమా నిర్వాహకులకు స్థానిక టీడీపీ నాయకులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు జాకీర్, షరీఫ్, ఇంతియాజ్, టీడీపీ నాయకులు సతీష్, కమలాకర్‌రెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.17.4 లక్షల గంజాయి స్వాధీనం

వెంకటాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు ట్రక్కు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.17.40 లక్షల విలువైన 174 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... మంగళవారం రాత్రి వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ39వీఏ9012 నెంబరు గల ట్రక్కు ఆటో పోలీసులను గమనించి వెనక్కు తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా గుర్తించిన పోలీసులు ఆటోను వెంబడించి పట్టుకున్నారు. దానిని పరిశీలించగా అందులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఆటోలో ఉన్న అన్నమయ్య జిల్లా చినమండెం మండలం చాకిబండ గ్రామానికి చెందిన మేదరి బాలకృష్ణ, రాజమ్మ దంపతులను అదుపులోకి తీసుకుని విచారించగా శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు గంజాయిని తరలిస్తున్నట్లు వెలుగు చూసింది. దీంతో ఆటోతో పాటు గంజాయిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అందులో పరిశీలించగా 90 ప్యాకెట్లలో 174 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.17.40 లక్షలు ఉంటుందని, మరో ముగ్గురు పరారయ్యారని పోలీసులు తెలిపారు. గంజాయిని పట్టుకున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు, ఎస్ఐ అంజనేయులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ జీ కృష్ణకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.



గంజాయి రవాణాకు వినియోగించిన ట్రక్కు ఆటో

- పశుసంవర్ధక శాఖలో కీలక పోస్టు కోసం పోటీ
- కూటమి ప్రభుత్వం రాకతోనే డిమాండ్

కుర్చీ కోసం కుస్తీ

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరులోని పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో అదో కీలకమైన కుర్చీ. అక్కడ కూర్చొనేవారిని టెక్నికల్ ఆఫీసర్, నోడల్ అధికారి, స్టోర్ రూం ఇన్చారి ఇలా ఎవరికి నచ్చినట్లు వారు పిలుస్తుంటారు. జేడీని కలవాలన్నా, ముఖ్యమైన ఫైళ్లపై సంతకాలు చేయాలన్నా, శాఖా పరంగా ఇంకేమైనా ఉన్నా మొదటగా ఆ కుర్చీలో కూర్చొనే వ్యక్తిని కలవాలన్నది అక్కడి ఆచారం. ఒకరకంగా చెప్పాలంటే షాడో జేడీ అన్న మాట. జిల్లావ్యాప్తంగా పశువైద్యశాలలకు అవసరమైన మందులు, పశు దాణా పంపిణీ వంటి ముఖ్యమైన స్కీముల పర్యవేక్షణ బాధ్యత ఈ అధికారిదే. ఇంకా చెప్పాలంటే అధికారులు, వైద్యులు, సిబ్బంది పనితీరును జేడీ దృష్టికి తీసుకెళ్లడం, డిప్యూటేషన్లు వంటి విషయాల్లో కీలకపాత్ర పోషిస్తుంది. ఇంతటి ప్రాధాన్యమైన సీటు అది.

బడ్జెట్ పెరగడమే కారణమా?



గతంలో పశువులకు అవసరమైన మందులు, ఇంజక్షన్లు, దాణా వంటివి జిల్లా అవసరాల మేరకు ప్రభుత్వం జిల్లాకు ఓ బడ్జెట్ కేటాయించేది. అయితే గత వైసీపీ హయాంలో ఈ పద్ధతిలో మార్పులు తెచ్చారు. మండ లాల వారీగా ఆయా ప్రాంతాల అవస రాలను బట్టి ఏ మందులు అవసరమో అక్కడి వైద్యులు ఆన్‌లైన్‌లో వారికి కేటాయించిన బడ్జెట్‌లో ఆర్డర్లు పెట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గత ఐదేళ్లలో ఈ సీటు కోసం ఎవరూ పోటీ పడలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి ఈ సీటుపై అందరి కన్ను పడింది. పాడిపరిశ్రమకు అధికంగా బడ్జెట్ కేటాయింపులు ఉంటాయనేది ఒక కారణంగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాకు క్వార్టర్‌కు (3 నెలలు) రూ.కోటి మందులకు కేటాయించింది. అది కూడా ఒక క్వార్టర్‌కు కేటాయిస్తే మరో క్వార్టర్‌కు కేటాయింపులు ఉండేవి కాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక క్వార్టర్‌కు దాదాపు రూ.1.96 కోట్ల బడ్జెట్ కేటాయిస్తోంది. అంతేగాక గోకులాలకు ఎంతో ప్రాధాన్యమిస్తోంది. అనేక పథకాలకు బడ్జెట్ కేటాయింపులు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఈ సీటుకు ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పోటీ అనివార్యమైందని ఆ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బందే బహిరంగంగానే మాట్లాడుతున్నారు.

2 నెలలకే మరొకరికి ఆర్డర్?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఐదేళ్ల నోడల్ అధికారిగా పని చేసిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌ను (వీఏఎస్) డిప్యుటేషన్ సమయం ఉన్నా ప్రభుత్వం మరో వీఏఎస్‌ను కేటాయించింది. వైసీపీ మద్దతుదారుడిగా ముద్ర పడిన అయన్ను అక్కడ నుంచి రెగ్యులర్ పోస్టుకు కాకుండా మరోచోటకు డిప్యూటేషన్ వేయడం చర్చనీయాంశమైంది. మొత్తం మీద అతనికి ఉన్న రాజకీయ పరిచయాలతో రెగ్యులర్ పోస్టుకు వెళ్లిపోయారు. కాగా, మంత్రి సిఫారసుతో ఆ సీటులోకొచ్చిన మరో వీఏఎస్‌కు ఆదిలోనే అవరోధం ఎదురైంది. కనీసం రెండు నెలలు కూడా పూర్తికాక ముందే మరో వీఏఎస్‌ను ఆ సీటుకు డిప్యూటేషన్ వేసినట్లు సమాచారం. మంత్రి సిఫారసుతో వచ్చిన ఆ వీఏఎస్‌ను నెల్లూరు డివిజన్‌కు డిప్యూటేషన్ వేసినట్లు తెలుస్తోంది. ఇది కూడా పెద్ద చర్చ నడుస్తోంది. మొత్తం మీద కీలకమైన ఆ పోస్టు కోసం పశుసంవర్ధక శాఖలో కనిపించని కుస్తీ పోటీ జరుగుతోంది.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగుల నుంచి సీఐఎస్ఎఫ్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ కానిస్టేబుల్ డ్రైవర్స్ అండ్ డీసీపీవో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించారని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ పూర్తి చేసి ప్రభుత్వ రంగంలో ఉపాధిని కోరుకునే వారికి ఇది మంచి అవకాశమని తెలిపారు. పూర్తి వివరాలకు https://cisfrectt.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు. మార్చి 4వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో..

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో పోస్టుల భర్తీకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఉపాధి అధికారి తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు https://ioci.com/latest-job-opening వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు. దరఖాస్తుకు ఈ నెల 23 ఆఖరని తెలిపారు.

నేడు లంకా దినకర్ రాక

నెల్లూరు (హరనాథపురం) : ఇరవై సూత్రాల ఆర్థిక కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ గురువారం నెల్లూరుకు చేరుకుని రాత్రి బస చేస్తారు. 21వతేదీ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మీడియాతో మాట్లాడుతారని అధికార వర్గాలు ప్రకటించాయి.

● రేపు విజయకుమార్..

మాల సంక్షేమ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ పెద్దపూడి విజయకుమార్ శుక్రవారం నెల్లూరుకు చేరుకుని రాత్రి బస చేస్తారు. 22వతేదీ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడుతారని అధికారులు పేర్కొన్నారు. అలాగే, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా 21వతేదీ జిల్లాకు రానున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

సుబ్బయ్య బడి చరిత్రలో నిలిచిపోతుంది : ఎమ్మెల్యే కావ్య

అల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ కాలంలో తెలుగు పాఠశాలగా ఏర్పాటై నేడు నూరేళ్ల పంటగా నిలిచిన సుబ్బయ్యబడి చరిత్రలో నిలిచిపోతుందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా కష్టపడాలన్నారు. 25 ఏళ్లక్రితం ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న విద్యార్థులను చూసి, అప్పుడే ఎమ్మెల్యే కావాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తాననుకున్న లక్ష్యాన్ని చేరుకున్నానన్నారు. కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి అమర్‌రెడ్డి, మేడా శ్రీనివాసులురెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు కొప్పు శ్రీనివాసులు, అరగల రమణయ్య, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పల్లెల అభివృద్ధి

నెల్లూరు(వ్యవసాయం, ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లెల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ సర్పంచుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోపిరెడ్డి పావని పేర్కొన్నారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో పాలకులు, అధికారులు స్థానిక సంస్థలను పట్టించుకోలేదని, సర్పంచుల ఖాతాల్లోని నిధులను దారిమళ్లించారని ఆరోపించారు. కానీ, కూటమి ప్రభుత్వంలో సర్పంచుల ఖాతాల్లో నిధులు వేసి పల్లెల అభివృద్ధికి బాటలు వేశారని, ప్రజాప్రతిధులకు గౌరవం లభిస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు గౌరవం కరువైందని వైసీపీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో నరుకూరు ఎంపీటీసీ సభ్యుడు కొణతం రఘుబాబు, సర్పంచుల సంఘం నాయకులు ఉయ్యాల భాస్కర్, చిట్టేటి కవిత, చేవూరు శ్రీనివాసులు, గోపిరెడ్డి వెంకటేష్ యాదవ్, గూడూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి బుధవారం 1174 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టులో 61.749 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, 6వ నెంబరు క్రస్ట్ గేట్‌తో 2,600, పవర్ టెన్నల్ నుంచి 2,400 క్యూసెక్కులు డెల్టాకు సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో

రాపూరు : కండలేరు డ్యాంలో 52.8 టీఎంసీల నీరు ఉందని ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా అవుట్‌ఫ్లో 1135 క్యూసె క్కులుగా ఉందన్నారు.

రెండు పొగాకు బ్యారన్ల దగ్ధం

మర్రిపాడు : నందవరంలో మంగళవారం రాత్రి రెండు పొగాకు బ్యారన్లు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. బ్యారన్‌లో ఆకు క్యూరింగ్ అవుతుండగా పైనుంచి ఆకు రాలి పొగ గొట్టం మీద పడటంతో ఈప్రమాదం జరిగింది. మంటలు పక్కన ఉన్న మరో బ్యారన్‌లోకి వ్యాపించడంతో అందులోని ఆకు మొత్తం కాలి దగ్ధమైంది. మర్రిపాడు, ఆత్మకూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సుమారు రూ. 8లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు పరిమి వెంకటరమణమ్మ, కాకర్ల వెంకటేశ్వర్లు తెలిపారు.

వీఆర్వోను దుర్భాషలాడిన టీడీపీ నేత

కలిగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు వీఆర్వోపై బుధవారం గ్రామ టీడీపీ నాయకుడు దాడి చేశాడు.దీంతో బాధితుడు తహసీల్దార్‌కి ఫిర్యాదు చేశాడు. సేకరించిన సమాచారం మేరకు, మండలంలోని పెదకొండూరు వీఆర్వోగా పనిచేస్తున్న నరేష్ గతంలో వెలగపాడు రెవెన్యూ పరిధిలోని పెదఅన్నలూరు వీఆర్వోగా పనిచేశారు. ఆ సమయంలో పెదఅన్నలూరుకి చెందిన టీడీపీ నేత ప్రసాద్‌తో భూముల విషయమై విభేదాలు చోటుచేసుకున్నాయి. ఇటీవల ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించినప్పుడు ఈ విషయమై ఎమ్మెల్యే ఎదురుగానే ఇరువురు వాగ్వివాదానికి దిగారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం భోజనం కోసం తహసీల్దారు కార్యాలయం నుంచి సర్వేయర్లు వంశీ, రవితేజతో కలిసి నరేష్ పట్టణంలోకి వస్తున్నారు. మసీదువీధి సెంటర్‌లోని అరుగు వద్దకు రాగానే తనను ప్రసాద్ చొక్కా పట్టుకొని, దుర్భాషలాడినట్లు వీఆర్వో నరేష్ తెలిపారు. స్థానికులు అడ్డుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయంపై తహసీల్దారుకి ఫిర్యాదు చేసినట్లు వీఆర్వో తెలిపారు. కాగా పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

అంతర్జాతీయ టెంపుల్ ఎక్స్‌పో వేదికలో జొన్నవాడ ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్‌పో 2025 వేదికగా ఈనెల 17,18,19 తేదీలలో తిరుపతిలో జరిగిన ప్రపంచ వ్యాప్త ఆలయాల ప్రతినిధుల సదస్సులో జొన్నవాడ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 15 వందలకు పైగా దేవాలయాలలో జొన్నవాడ ఆలయం కూడా చేరింది. ఈ సదస్సుకు విచ్చేసిన వారికి జొన్నవాడ ఆలయ చరిత్ర, భక్తులకు కల్పించే సౌకర్యాలు, అన్నప్రసాద వతరణ, వసతి గదులు తదితర సదుపాయాలు గురించి వివరించినట్లు ఆలయ ఈవో ఏపీ. శ్రీనివాసులురెడి తెలిపారు. ఈ సదస్సులో ఆధ్యాత్మిక సంప్రదాయాలకనుగుణంగా ఆధునిక ఆలయ నిర్వహణపై జ్ఞానం, భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తోడ్పడే వినూత్న పరిష్కారాలు, స్థిరమైన పద్ధతులు సాంప్రదాయం, సాంకేతికతతో పరివర్తనాత్మక అనుభవం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆర్థిక నిర్వహణ, పార్యవరణ అనుకూల పద్ధతులపై అవగాహన కల్పించారన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	75
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	206
లేయర్	127

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8276
వెండి కిలో ధర	రూ. 99,700
వెండి ఒక గ్రాము	రూ.102.70

నకిలీ బంగారం ఇచ్చి.. ఒరిజినల్ బంగారం దోచేసి!



సీసీ కెమెరా ఫుటేజీలో ఉన్న గుర్తుతెలియని మహిళలు

ఉదయగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిలోని ఓ బంగారు దుకాణంలో ఇద్దరు మహిళలు నకిలీ బంగారం ఇచ్చి ఒరిజినల్ బంగారం, నగదు తీసుకెళ్లిన ఘటన బుధవారం చోటుచేసుకొంది. పట్టణంలోని శ్రీవాసుకి జ్యూవెల్లరీ దుకాణంలోకి ఇద్దరు మహిళలు వెళ్లి 916 హాల్‌మార్క్ ఉండే 4 సవర్ల నకిలీ చైన్‌ను దుకాణ యజమానురాలు సరస్వతి, ఆమె కుమారుడు వాసుకి చూపించారు. తమది గండిపాళెం అని, ఆ చైన్‌ను తీసుకొని 3 సవర్ల చైన్ ఇవ్వమని అడిగారు. దీంతో సరస్వతి లెక్కలు వేసి చైన్‌తోపాటు రూ.5 వేలు నగదు వస్తుందని వారికి తెలిపారు. ఇందుకు వారు అంగీకరించి, చైన్, నగదు తీసుకుని వెళ్లిపోయారు. పని నిమిత్తం నెల్లూరు వెళ్లిన సరస్వతి భర్త సుధాకర్ రాత్రికి దుకాణానికి చేరుకొన్నాడు. సరస్వతి బంగారు విక్రయించిన విషయాన్ని భర్తకు చెప్పింది. ఆయన దానిని పరిశీలించగా, నకిలీదని తేలింది. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దుకాణానికి చేరుకొని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తయిన ఇంటర్ ప్రాక్టికల్స్

● జనరల్ పరీక్షలకు సన్నాహాలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు(ప్రాక్టికల్స్) బుధవారంతో పూర్తయ్యాయి. ఈనెల 5 నుంచి మూడు విడతలుగా 23 కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్, 10వతేదీ నుంచి 2 విడతలుగా 121 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రశాం తంగా ముగిశాయని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు తెలిపారు. ప్రాక్టికల్స్ పూర్తయిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చి 1 నుంచి ప్రారంభంకానున్న థియరీ పబ్లిక్ పరీక్షలకు సన్నాహాలు చేస్తున్నామని, ఈ పరీక్షలను కూడా ఎక్కడా ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తామని చెప్పారు. కాగా, చివరి రోజున ప్రాక్టికల్స్‌కు ఉదయం సెషన్‌లో 375 మంది విద్యార్థులకు 369 మంది హాజరుకాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం 381 మందికి 375 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఆర్ఐవో 3, డీవీఈవో 2, డీఈసీ సభ్యులు 5 కేంద్రాలను పరిశీలించారు.

జిల్లాలో 35 గ్రామాల్లో పైలెట్ రీసర్వే

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

సంగం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున జిల్లా వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు కింద 35 గ్రామాల్లో రీసర్వే చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని కొరిమెర్ల కండ్రికలో పైలెట్ ప్రాజెక్టు కింద జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు నోటీసులు అందచేసి వారి సమక్షంలోనే రీసర్వే నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఆవిధంగా జరుగుతున్నాయా.. లేదా అని ప్రతిరోజు క్షేత్రస్థాయిలో రీసర్వే జరిగే గ్రామాలను తనిఖీ చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే మండలంలోని కొరిమెర్ల కండ్రికలో జరిగే రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలించామన్నారు. మిల్లర్లు ధాన్యానికి మద్దతు ధర కంటే తగ్గించినప్పుడు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంప్రదించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్డీవో పావని, తహసీల్దారు సోమ్లా నాయక్, సర్వేయర్‌లు, సర్వే సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.



రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

పోలీస్ వ్యవస్థను కించపరిచిన జగన్‌పై కేసు నమోదు చేయాలి

● టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టలేదా!?

● కొడాలి నానికీ త్వరలో చిప్పకూడే!

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను కించ పరిచిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై సుమోటోగా వెంటనే కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అరాచకాలకు, విధ్వంసాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిపోయారని దుయ్యబట్టారు. పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రఘురామకృష్ణంరాజును జైలులో చిత్రహింసలు పెట్టలేదా!? అంటూ ప్రశ్నించారు. పోలీసులను ఎలా వాడుకోవాలో, ప్రత్యర్థులపై ఎలా కేసులు పెట్టాలో జగన్ పాలనలో చూశామని గుర్తు చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏనాడు పోలీసులపై అనుచిత వాఖ్యలు చేయలేదని అన్నారు. దళిత యువకుడు సత్యవర్ధన్‌ను కులం పేరుతో దూషించి కిడ్నాప్ చేస్తే ఆ కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీని అరెస్టు చేయకూడదా అంటూ ప్రశించారు. అధికారంలోకి వస్తానని జగన్ కలలు కంటున్నాడని, అయితే త్వరలో ఆయన జైలుకు వెళ్లడం తథ్యమని అన్నారు. తల్లిని, చెల్లిని ఇంటినుంచి తరిమి వేసిన జగన్‌కు ఇంకా బుద్ది రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో జిప్ విప్పడం, మహిళలను కించ పరిచేలా వ్యవహరించిన వైసీపీ నేతలకు జైలేగతి అని కోటంరెడ్డి వాఖ్యానించారు. రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై వంశీ చేసిన వాఖ్యలు ప్రజలు ఇంకా మరిచి పోలేదన్నారు. కొడాలి నానికి కూడా త్వరలో చిప్పకూడు తప్పదని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, నేతలు పిట్టి సత్యనారాయణ, కువ్వారపు బాలాజీ, జహీర్, మొహిద్దీన్, తంబి, సుజన్, షాహిద్, నవీన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశా లలో బుధవారం జరిగిన డిగ్రీ మూడవ, ఆరవ సెమిస్టర్ మెగా సప్లిమెం టరీ పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంక ట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్ష లకు 207 మంది విద్యార్థులకు 202 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

గురుకులం.. భవితకు వరం!

● అందిపుచ్చుకుంటే బంగారు భవిత

● సీటు సాధిస్తే టెన్త్ వరకు ఉచితం

● దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదల

● ఏప్రిల్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశపరీక్ష నిర్వాహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలోని 8 బాలికల గురుకుల పాఠశాలలు, ఆరు కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యార్థినుల ప్రవేశానికి ప్రకటన జారీ చేసింది. మార్చి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ, ఏప్రిల్ 4న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

5వ తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ వరకు విద్యతోపాటు అన్నీ ఉచితమే. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉచిత వసతి, ప్రతి రోజు మెనూతో కూడిన భోజనంతోపాటు క్రమశిక్షణతో కూడిన అత్యుత్తమ విద్యనందిస్తారు. అంతేగాక యూనిఫాం, ప్రతినెల కాస్మెటిక్స్ కింద నగదు, ఉదయం అల్పాహారంలో పాలు, సాయంత్రం స్నాక్స్‌తో కూడిన పౌష్టిహారం అందచేస్తారు. ఇక్కడ చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండటంతో గురుకుల పాఠశాలలపై తల్లిదండ్రుల ఆసక్తి పెరుగుతోంది. అందుకే ప్రవేశ పరీక్షకు వందల సంఖ్యల్లో దరఖాస్తులు వస్తున్నాయి. గురుకుల విద్యాసంస్థల్లో సీట్ల వివరాలు, ఎంపిక వివరాలను జిల్లా ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్ సమన్వయాధికారిణి టి పద్మజ తెలియజేశారు.

● 5వ తరగతి ప్రవేశపరీక్ష ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుంది. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుంది.

ప్రవేశ పరీక్షకు అర్హతలు

● 5వ తరగతి ప్రవేశానికి జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023-24, 2024-25 విద్యాసంవత్సరాలలో 3, 4వ తరగతులు చదివి ఉండాలి.

● ఎస్సీ ఎస్టీ విద్యార్థినులు 01-09-2012 నుంచి 31-08-2016లోపు జన్మించి ఉండాలి.

● ఓసీ, బీసీ, హెచ్‌సీ విద్యార్థినులు 01-09-2014 నుంచి 31-08-2016 లోపు పుట్టిన వారై ఉండాలి, ఇంటర్మీడియట్‌కు..

● 31-8-2025 నాటికి 17 సంవత్సరాలు మించరాదు. అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, ఎస్సీ హాస్టళ్లలో చదివిన వారికి ఒక సంవత్సరం వయసు సడలింపు ఉంటుంది.

● 2024-25 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పరీక్షలు రాస్తున్నవారు మాత్రమే అర్హులు. ఆ తర్వాత టెన్త్ ఉత్తీర్ణులై ఉండాలి.

జిల్లాలోని గురుకులాల వారీగా సీట్ల వివరాలు

పాఠశాల	5వతరగతి	ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం		ఫోన్ నెంబర్లు
		ఎంపీసీ	బైపీసీ	
సంగం	80	40	40	9704550105
పెద్దపవని	80	40	40	9704550083
ముత్తుకూరు	80	40	40	9704550096
బుచ్చిరెడ్డిపాళెం (రామచంద్రాపురం)	80	40	40	970455010
సర్వేపల్లి (కోడూరు)	80	40	40	9640882494
రాపూరు (కండలేరు)	80	40	40	9963840184
బోగోలు	80	--	–	9347885535
ఆదూరుపల్లి	80	--	–	9441956933

సీట్ల కేటాయింపు ఇలా..

ప్రతి పాఠశాల, కళాశాలలోని 80 సీట్లలో ఎస్సీ 75 శాతం (60 సీట్లు), ఎస్టీలకు 6 శాతం (5సీట్లు), బీసీలకు 5 శాతం(4సీట్లు) బీసీసీ (హెచ్‌సీ)లకు 12 శాతం (10 సీట్లు), ఓసీలకు 2 శాతం (ఒక సీటు) రిజర్వేషన్ ప్రకారం కేటాయిస్తారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● రెండు సవర్ల బంగారు ఆభరణాల అపహరణ



బాధితురాలితో మాట్లాడుతున్న సీఐ ఫిరోజ్, వేలిముద్రలు స్వీకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

కావలి రూరల్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరగ్గా, బాధితుడు వెంకట రమణయ్య బుధవారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు, పట్టణంలోని పెద్ద పవని బస్టాండ్ సమీపంలోని బండ్లవారి వీధిలో నివాస ముంటున్న వెంకట రమణయ్య కుమారై తిరుపతిలో ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుమారై వద్ద కు ఆయన వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఇంటి తలుపులు పగల గొట్టిన దుండగులు బీరువా తాళాన్ని ధ్వంసంచేసి, అందు లోని రెండు సవర్ల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్, నెల్లూరు క్లూస్ టీం సభ్యులు పరిశీలించి వేలిముద్రలు స్వీకరించారు. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్టుసర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

● కాలిపోయిన రూ.6 లక్షల నగదు, 17 సవర్ల బంగారు ఆభరణాలు

● బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



ఇంట్లో నుంచి ఎగసి పడుతున్న మంటలు

కావలి రూరల్, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరులో మంగళవారం అర్ధరాత్రి షార్టుసర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. బాధితుడు దాసరి వెంకటనర్సయ్య కథనం మేరకు, ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో షార్టు సర్క్యూట్‌తో ఏసీలో మంటలు వచ్చి ఇంటికి వ్యాపించాయి. దీంతో ఇంట్లో వారు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు అదుపు చేయించారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఫర్నీచర్, ఇంటి డాక్యుమెంట్లు, దుస్తులతోపాటు వాటి కింద ఉంచిన రూ. 6 లక్షల నగదు, 17 సవర్ల బంగారు ఆభరణాలు కాలిపోయాయని బాధితుడు తెలిపారు. 11 సవర్లు కాలిన బంగారు ఆభరణాలు దొరకగా, ఆరు సవర్లు పోయాయని తెలిపారు. కాగా మంగళవారం అర్ధరాత్రి బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



మనుబోలులో అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వెంకటసుబ్బయ్య

మార్చిలోగా పీఎంశ్రీ పనులు పూర్తి

● ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటసుబ్బయ్య

మనుబోలు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 42 ప్రభుత్వ పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం నిధులతో చేపట్టిన పనులన్నీ మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆరు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను, అర్థాంతరంగా ఆగి ఉన్న నాడు-నేడు-2 భవనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం ఫేస్-2 కింద కేటాయించిన పాఠశాలలకు రూ.3కోట్లు జమచేసి ఉన్నారన్నారు. ఈ నిధులతో పాఠశాలలో క్రీడా స్థలాల నవీకరణ, ల్యాబ్‌ల ఏర్పాటు, పాఠశాల నిర్వహణ, తాగునీరు తదితర పనులన్నింటిని పూర్తిచేసి మార్చి నెలాఖరుకల్లా నివేదికలు పంపాలన్నారు. నాడు-నేడులో ఆగిన పనులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నుంచి నిర్ణయం రావాల్సి ఉందన్నారు. నాడు-నేడు పనులు పూర్తి చేసిన వరకు బిల్లులు ఇచ్చేశామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల నుంచే పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత కూడా అంగన్‌వాడీలపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుధీర్‌బాబు, ఏపీవో ప్రసాద్, ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● జిల్లా వైద్య నిఘా అధికారిణి డాక్టర్ మౌనిక థామస్



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య నిఘా అధికారి డాక్టర్ మౌనికథామస్

మనుబోలు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు సకాలంలో టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య నిఘా అధికారి డాక్టర్ మౌనికథామస్ హెచ్చరించారు. బుధవారం ఆమె మండలంలోని మనుబోలు, కాగితాలపూరు, బండేపల్లి, కొండూరుసత్రం అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న టీకాల నిర్వహణను పరిశీలించారు. ఎంతమంది చిన్నారులకు ఏఏ రకాల టీకాలు వేశారో రికార్డులు పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే 5ఏళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా సరైనా సమయంలో వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, కాలం చెల్లిన టీకాలు వేసినా ఏఎన్ఎంలపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజ య్య, హెల్త్ అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.

పాత కక్షలతో హత్యాయత్నం: నిందితుడి అరెస్టు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో నెల్లూరులో మంగళవారం రాత్రి ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఏసీనగర్‌కు చెందిన పటాన్ మౌలాలి రాయపుపాలెంలో చికెన్ పకోడా దుకాణం నిర్వహిస్తున్నాడు. 20 రోజుల కిందట అదే ప్రాంతానికి చెందిన గంగాధర్ మౌలాలి దుకాణానికి వెళ్లి చికెన్ పకోడా ఇవ్వాలని కోరాడు. పకోడా ఇవ్వడం ఆలస్యం కావడంతో గంగాధర్ కోపంతో దుకాణంలో ఉన్న చికెన్ పకోడాను కిందపడేశాడు. దీంతో గంగాధర్, మౌలాలి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రాయుపుపాలెం-రామచంద్రాపురం జంక్షన్‌లో గంగాధర్ పై మౌలాలి కత్తితో దాడి చేశాడు. బాధితుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన ఎస్ఐ రెహమాన్ బుధవారం ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేశారు.

దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● డీఎస్పీతో అగ్రిగోల్డ్ బాధితులు, సీపీఐ నేతలు



డీఎస్పీ శ్రీధర్‌కి వినతిపత్రం ఇస్తున్న అగ్నిగోల్డ్ బాధితులు, సీపీఐ నాయకులు

కావలి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): అగ్నిగోల్డ్ బాధితులపై దాడులకు పాల్పడిన వారిపైన, జామాయిల్ తోటలను అక్రమంగా నరికి తీసుకెళ్లిన వారిపైన చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ బాధితులు, సీపీఐ నేతలు కోరారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పీ. శ్రీధర్‌కు వారు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ వరికుంటపాడు మండలం కనియంపాడు, భాస్కరాపురం గ్రామాల్లో రూ. కోట్ల విలువ చేసే జామాయిల్‌కర్ర అక్రమంగా నరికి తీసుకెళ్లుతున్నా అధికారులు పట్టించుకోవటంలేదని వాపోయారు. దీంతో అగ్రిగోల్డ్ బాధితులు, సీపీఐ నాయకులు అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణ కమిటీగా ఏర్పడి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆ తర్వాత సీఐడీ అధికారులు వచ్చి మొక్కుబడిగా పరిశీలించి వెళ్లారే కాని, ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బాధితులపై దాడులు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీని కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తిరుపతిరావు, జిల్లా అధ్యక్షుడు శంకరయ్య, ప్రచార కార్యదర్శి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు క్రిష్ణయ్య, రాధాక్రిష్ణ సీపీఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రోచ్చరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు కాకర్ల సురేష్ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని తిలకించారు. పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

వింజమూరు : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను బుధవారం ఆయన పరిశీలించి వైద్యులకు, సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. అలాగే అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల డీడీఓ కార్తీక్, వైద్యులు మధుసూదన్, మసూద్, శ్వేత, సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ఎమ్మెస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కావలిని కాస్మోసిటీగా మారుస్తా : ఎమ్మెల్యే కావ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో కావలిని కాస్మోసిటీగా మారుస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని స్వర్ణకారుల సంఘం కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఏవీఎస్ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వర్ణకారుల భవనానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 600 దుకాణాల నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. తొలుత స్వర్ణకారుల సంఘం కమిటీ చేత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన కమిటీని, ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు పీ. నటరాజాచారి, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో ఈనెల 20వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించే ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. ఈ శిబిరంలో పిల్లలకు కొత్తగా ఆధార్ కార్డులు నమోదు చేయడం, తప్పులు సవరిచడం, మార్పులు చేయడం జరుగుతుందన్నారు. 20వ తేదీన అనుమసముద్రం, గుడిపాడు, చిరమన, 21న శ్రీకొలను, రాజవోలు, 22న జమ్మవరం, కొండమీదకొండూరు, ఏఎస్ పేట, 24న గుంపార్లపాడు, పెద్దహబీపురం, 25న కావలి ఎడవల్లి, చౌటభీమవరం, 21నుంచి 25వ తేదీ వరకు ఏఎస్‌పేట సచివాలయలో శిబిరాలను నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్టీలకు న్యాయం చేయాలి


సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి బ్రహ్మయ్య

కందుకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండికందుకూరు కుంటపోరంబోకులో నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు సరైన ప్రదేశంలో నివాసస్థలాలు కేటాయించి, పక్కాగృహాలు మంజూరు చేయాలని సర్పంచి కుమ్మర బ్రహ్మయ్య సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు బుధవారం విజ్ఞప్తి చేశారు. సర్వేనెం 146-2లో 4.17 ఎకరాల కుంట పోరంబోకు భూమి ఉందని, ఆ భూమిలో కొన్నేళ్లుగా 30 యానాదుల కుటుంబాలు జీవిస్తున్నారని తెలిపారు. అయితే కుంటపోరంబోకులో పక్కాగృహాల మంజూరుకు సాంకేతికంగా ఇబ్బందులు ఉండటంతో వారు పూరిగుడిసెల్లోనే నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎస్టీ కుటుంబాల వారికి నివాసయోగ్యమైన చోట స్థలాలు ఇచ్చి పక్కాగృహాలు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీదేవి చౌదరి పుస్తకాల ఎంపిక

కావలి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు గుంటుపల్లి శ్రీదేవిచౌదరి రచించిన కమ్యూనికేషన్ అండ్ స్కాఫ్ట్ స్కిల్, బిజినెస్ కమ్యూనికేషన్.. అనే రెండు పుస్తకాలను ఏపీ ప్రభుత్వ పౌర గ్రంథాలయశాఖ ఎంపికచేసింది. 2022-23 లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆమోదం పొందిన పుస్తకాల వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో శ్రీదేవి చౌదరికి అరుదైన గౌరవం దక్కింది. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ రాజకుమార్‌చౌదరి, ప్రిన్సిపాల్ ఉమ, అధ్యాపకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రేపు మాలకొండలో వేలం పాటలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మాలకొండ ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు దుకాణాలకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వీ సాగర్‌బాబు తెలిపారు. ఈనెల 7న జరిగిన వేలంలో పాటదారుల నుంచి స్పందన లేనందున వాయిదా వేసిన సంగతి తెలిసిందే. దీంతో తిరిగి వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు.

రజక మాన్యం స్థలాన్ని కాపాడాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రజక కాలనీ వాసులు

సీతారామపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రజక మాన్యం స్థలాన్ని కాపాడాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రజక కాలనీవాసులు బుధవారం ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాములవారి గుడి నిర్మాణానికి ఉంచిన స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, గతంలో రజక కాలనీలో ఉండి ఇళ్లను అమ్ముకొని పోయినవారు తిరిగి కాలనీకి వచ్చి ఖాళీగా ఉన్న రజక మాన్యం స్థలాన్ని ఆక్రమించుటకు కర్రలు పాతారని, గుడి కోసం ఉంచిన స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరారు.

వెంటాడుతున్న పశుగ్రాసం కొరత

పాడిరైతుల అవస్థలు


మేత కోసం వలస పోతున్న ఆవులు

మర్రిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశుగ్రాసం కొరతతో పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. పశుసంవర్థక శాఖ గణాం కాల ప్రకారం మండలంలో 3238 ఆవులు, 21,858 గేదెలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 4వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈక్రమంలో పాడి పశువులకు పశుగ్రాసం దొరక్క అవస్థలు పడుతున్నారు. గతంలో వరి పంటను కూలీలు కోసేవారు. దీంతో గడ్డి పుష్కళంగా దొరికేది. కాగా, వరికోతకు యంత్రాలను వాడడంతో పశువులకు ఎండు గడ్డి దొరకటం లేదు. ట్రాక్టరు వరిగడ్డి రూ. 12వేలు పలుకుతోంది. దూర ప్రాంతాల నుంచి గ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తుండడంతో రవాణా ఖర్చులు మరింత భారంగా మారుతున్నాయి. గతంలో ప్రతీ ఏటా మినుము, ఉలవ, పెసర వంటి పంటలు సాగు చేస్తుండటంతో ఎంతో కొంత గ్రాసం దొరికేది. రెండేళ్ల నుం చి రైతులు మిరప, బొప్పాయి వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో గ్రాసం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. గత ప్రభుత్వం గ్రాసాల క్షేత్రాల పెంపకానికి రైతులకు సహకరించక స్వస్తి పలకడంతో పశుపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈనేపథ్యంలో పశుసంపదను కాపాడుకునేందుకు ఇళ్లను వదిలి జీవాలను వెంట బెట్టుకుని సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, తొలకరి జల్లులు కురిసేంతవరకు కుటుంబాలను వదిలి అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పశుపోషకులు వాపోతున్నారు.

సనాతన ధర్మం కోసం పోరాడిన ఛత్రపతి శివాజీ


ఉదయగిరి : శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్కంధపురి ఉద్యానవనం సమీపంలోని భజరంగీ సెంటర్ నుంచి పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పామూరు రోడ్డు కూడలి వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో హిందువులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఖండ్ సంచాలక్ డాక్టరు తన్నీరు మల్లికార్జున మాట్లాడుతూ నేటికీ సనాతన ధర్మం, హిందూ దేవాలయాలు ఉన్నాయంటే, అది శివాజీ పోరాట ఫలితమేనని గుర్తుచేశారు. ర్యాలీలో శివాజీ వేషధారణలో చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

● ఉదయగిరి: స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు నెల్లూరు వెంకటస్వామినాయుడు, ఆవుల రోశయ్యయాదవ్, మోటపోతుల చెన్నయ్య, చల్లా సుబ్బరత్నం, దుగ్గయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● సంగం: తరుణవాయి గిరిజన కాలనీ పాఠశాలలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, బాలబ్రహ్మం, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తుల పరిశీలన


ఆత్మకూరు : దరఖాస్తులను పరిశీలిస్తున్న బ్యాంకు మేనేజర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, కమ్మ, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు, మండల పరిషత్ సిబ్బంది పరిశీలించారు. మండలంలో మొత్తం 200 మంది దరఖాస్తు చేసుకోగా 165 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో మొత్తం 46 రుణాలు మంజూరయ్యాయన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులను ఎంపిక చేసి బ్యాంకు రుణాలు మంజూరుచేయబడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఏపీజీబి, ఎస్‌డీసీ బ్యాంకుల మేనేజర్లు, మండల పరిషత్ పాలన అధికారి కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● దుత్తలూరు(ఉదయగిరి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రుణాలకు మండలంలో 248 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 140 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు:సబ్సిడీ రుణాల మంజూరు కోసం అందిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. మొత్తం 377 దరఖాస్తులు పరిశీలించినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ దరఖాస్తులను పునఃపరిశీలించి బ్యాంకర్ల సమక్షంలో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

● కలువాయి: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం మండలం అన్ని గ్రామాల నుంచి ఆన్‌లైన్ ద్వారా 407 దరఖాస్తులు అందినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. ఈనెల 25వ తేదీ ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్ల సమక్షంలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని చెప్పారు. దరఖాస్తుదారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

● అనంతసాగరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 267 మంది దరఖాస్తు చేసుకోగా 208 మంది హాజరైనట్లు ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు.

● కొండాపురం : మండలంలో రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముందుగా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు, సాయిపేట యూనియన్ బ్యాంకు పరిధిలో 52 మంది, కొమ్మి ఏపీజీబీ పరిధిలో 58 మంది అభ్యర్థులు హాజరయినట్లు ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో సాయిపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ సంతోష్‌కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● **నేడు బోగోలులో...**

బిట్రగుంట : బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రాయితీ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులకు ఉదయం నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. హాజరయ్యేవారు రేషన్, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌పుస్తకం ఒరిజినల్స్ తీసుకురావాలని తెలిపారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు తమ ఆధార్, పాన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11గంటలకు తప్పక హాజరు కావాలని కోరారు.

బాలికల హాస్టల్‌లో భద్రతపై పరిశీలన

సంగం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో బాలికల భద్రతపై ఎస్ఐ రాజేష్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే పోలీసులకు సమాచారం అందిచాలన్నారు. బాలికల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వసతి గృహ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

'చిన్నపంతులు'కు ఘనంగా వీడ్కోలు

కందుకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చిన్నపంతులుగా గుర్తింపు పొందిన కళాకారుడు, సినీనటుడు చిమ్మిలి మాలకొండయ్యకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించి, అంతిమ వీడ్కోలు పలికారు. లింగసముద్రం మండలం వీఆర్ కోటలో చిన్నపంతులు గుండెపోటుతో మృతి చెందగా బుధవారం మలినేని విద్యాసంస్థల చైర్మన్, సినీనటుడు మలినేని లక్ష్మయ్య, నిర్మాత, రచయిత ఉప్పు రమేష్ తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి


కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో అప్పాజీ సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. సర్వేలు సకాలంలో పూర్తిచేయాలన్నారు. మార్చి నెలాఖరు నాటికి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. రుణాలకు 322 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 200 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శులు నాగూర్‌బీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి రవికుమార్ సూచించారు. బుధవారం వరికుంటపాడు, విరువూరు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా జారీచేస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతులందరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాంటి వారికి మాత్రమే పీఎం కిసాన్ నగదు, ఇతర పథకాలు వర్తిస్తాయన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, ఫోన్ నంబర్లతో ఈనెల చివరి నాటికి రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సిబ్బంది సైతం గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు చంద్రశేఖర్, శారద, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ నుంచి పాఠశాలను మార్చొద్దని ధర్నా


ధర్నా చేస్తున్న గిరిజన కాలనీ వాసులు

గుడ్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి): స్థానిక గంధర్వ గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మరో పాఠశాలలో కలపవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక విద్యావనరుల కేంద్రం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గంధర్వ గిరిజన కాలనీ నుంచి మెయిన్ ప్రాథమిక పాఠశాల వరకు ఒకటిన్నర కిలోమీటర్ల ఉందని, దానికి తోడు రెండు ప్రధాన రహదారులను విద్యార్థులు దాటిపోవాల్సిన పరిస్థితి ఉంద న్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతా. దికారులు కలుగజేసుకొని కాలనీ పాఠశాలను యథావిధిగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవోకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, పాలకీర్తి నాగేశ్వరరావు, దామా కృష్ణయ్య, దళిత సంఘ నాయకులు మాల్యాద్రి, చెన్నయ్య, కొమరగిరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంకె పార్కు స్థలాన్ని శుభ్రం చేయాలి : సీపీఎం


మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి సెంటర్‌లో ఉన్న ఎస్ఎంకె పార్క్ కంపచెట్లు, చెత్తచెదారంతో నిండి అపరిశుభ్రంగా ఉందని, దానిని శుభ్రం చేయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని కోరారు. ఈ మేరకు సీపీఎం ఎల్ఆర్‌పల్లి శాఖ ఆధ్వ ర్యంలో స్థానికులు బుధవారం మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

● ఏఎస్ పేట: ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం జరిగిందని ఏఎస్ పేట మండల సీపీఎం కమిటీ సభ్యులు బుధవారం నిరసన తెలిపారు. ఉపాధి హామీ పనులకు, విద్య, వైద్య రంగాలకు నిధులు తగ్గించడం అన్యాయం అని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఊసే లేకపోయినా అధికార, ప్రతిపక్ష పార్టీలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే బడ్జెట్‌ను పేదలకు ఉపయోగపడేలా సవరించాలని కోరారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అశ్వత్థనారాయణ కల్యాణం

సంగం ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున నాగారపమ్మ ఆలయ సమీపంలో బుధవారం అశ్వత్థనారాయణ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాగి, వేపచెట్టును విష్ణువు, లక్ష్మీదేవిగా భావించి వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

సంగం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ- క్రాప్‌తోపాటు కేవైసీ చేసుకున్న రైతుల నుంచి ఏగ్రేడ్ రకం ధాన్యం క్వింటా రూ. 2320, సాధారణ రకం ధాన్యం క్వింటా రూ. 2300 చొప్పున కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ కార్యదర్శి వెంకట రమణయ్య తెలిపారు.

ఆక్రమిత స్థలాల పరిశీలన

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దక్కనూరులో ఆక్రమణకు గురైన స్థలాలను బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు పరిశీలించారు. కొంతమంది గ్రామస్థులు అందించిన ఫిర్యాదు మేరకు వీఆర్వో మనోహర్, పంచాయతీ కార్యదర్శి సుల్తాన్ గ్రామంలోని జగనన్న లేఅవుట్లలో ఆక్రమణకు గురైన ఇంటిపట్టాలు, రహదారులను సర్వేయర్ పవన్‌తో కలిసి పరిశీలించారు. ప్రజల నుంచి వివరాలు సేకరించారు. నివేదికలను తహసీల్దారుకు అందజేయనున్నట్లు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సందర్శన

కావలిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు కే. బ్రహ్మానందం బుధవారం పట్టణ బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం ఆహ్వానం మేరకు అధికారులను గౌరవప్రదంగా కలుసుకుని, బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు చేరువ చేయడంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తనను టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమించేందుకు సహకరించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని బ్రహ్మానందం పేర్కొన్నారు.

కావలిలో మెగా జాబ్ మేళా

కావలిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా జరిగింది. వివిధ కంపెనీలు నిర్వహించిన ఈ మేళాలో దాదాపు 80మంది పాల్గొనగా, 26మంది ఎంపిక అయినట్లు కళాశాల డైరెక్టర్ జానకీరామ్ తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ ప్రిన్సిపాల్ వీవీ రావు, నాక్ ప్రిన్సిపాల్ రవికాంత్, ప్లేస్‌మెంట్ అధికారి మహేష్, అధ్యాపకులు కబీర్, తిరుపాల్, ప్రోగ్రాం ఆఫీసర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

మొగిలిచర్లలో ప్రముఖులు

లింగసముద్రం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలో నారా లోకేష్ యువజన ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు వెంగళరావు తండ్రి కొండయ్య దశదిన కర్మ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు హాజరై, కొండయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నం వీరాస్వామి, బీ ప్రసాద్, రాంబాబు, పలువురు ఇతర నేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ఉదయగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా బుధ వారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంఈవో-2 శ్రీనివాసులు, సీడీపీవో సునీత, సూపర్‌వైజర్ తేజస్విని కార్యకర్తలకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈకార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు ఫణిరాజ్, సుబ్బారెడ్డి, సారధి తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

కందుకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలోని విద్యార్థినులకు ఐ స్క్రీనింగ్ నిర్వహించి, 83మందికి బుధవారం అద్దాలు పంపిణీ చేశారు. పట్టణంలోని కోటారెడ్డినగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి డాక్టరు బ్యూలాగ్రేస్ వీటిని పంపిణీ చేశారు కార్యక్రమంలో సూపర్‌వైజర్ లత, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

ఉదయగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తన పొలం కంచె రాళ్లను ధ్వంసం చేయడంతోపాటు తనపై దాడి చేశారని మండలంలోని అప్పసముద్రం గ్రామానికి చెందిన దగ్గుపాటి వెంగళరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొడ్డం మాలకొండారెడ్డి, మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

పీ4 సర్వేపై అవగాహన

సీతారామపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ పంచాయతీలోని బిట్ -1 సచివాలయం వద్ద ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన బుధవారం పీ4 సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఫోర్ సర్వే ద్వారా గ్రామ పంచాయతీలో అత్యంత పేదలను గుర్తించి, వారి వివరాలు సేకరించాలని తెలిపారు.

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని రోడ్డు మార్జిన్ వ్యాపారులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాం

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

● రోడ్డు మార్జిన్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

తిరెడ్డి సూచించారు. స్థానిక చెన్నూరురోడ్డులో బుధవారం పర్యటించిన ఆమె వ్యాపారుల సమస్యలతో పాటు ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. అనంతరం వ్యాపారస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నూరురోడ్డులోని రోడ్డు మార్జిన్ వ్యాపారులకు మార్కెట్ సముదాయం పూర్తికాగానే అక్కడ అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆటోలు కూడా బస్టాండ్ సెంటర్లో పెట్టి ట్రాఫిక్ సమస్య సృష్టించకుండా గిరిజాహాల్ ప్రాంతంలో పెట్టుకుని ఒక్కో ఆటో సీరియల్ ప్రకారం బస్టాండ్‌కు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. త్వరలోనే గిరిజాహాల్ ప్రాంతంలో ఆటోలు పెట్టుకునే ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా కూరగాయల వ్యాపారస్తుల కోసం ఆర్టీసీ బస్టాండ్



బుచ్చి చెన్నూరురోడ్డులో రోడ్డు మార్జిన్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ మొర్ల సుప్రజ, కౌన్సిలర్లు, నాయకులు, వ్యాపారస్తులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవీ శేషయ్య, హరిశ్చంద్ర, రామానాయుడు, ఎస్‌కే పర్వీన్, హరనాథ్, ప్రభాకర్, దశరథ, గుత్తా శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్కులో వసతులు కల్పించండి

● కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 11వ డివిజన్ ఎన్జీఓస్ నగర్‌లో ఉన్న ప్రజా పార్కులో కనీస వసతులు అత్యవసరంగా కల్పించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన అనంతరం పార్కులో ఏర్పాటు చేయవలసిన వసతులపై అధికారులకు సూచనలు చేశారు. నేల చదును చేయడం, క్రీడా సామాగ్రి ఏర్పాటు, ఫుట్‌పాత్, అర్చి నిర్మాణం, పచ్చదనం పెంచడం, పెయింటింగ్ వంటి పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. ఇందుకోసం రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తీసేయాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త పేరుకు పోవడంతో స్థానిక పారిశుధ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కళాశాల మైదానంలో చెత్త ఏరుకుని జీవనం సాగిస్తున్న వారికి ఐటీడీఏ సహాయంతో ప్రత్యామ్నాయం చూపాలని సూచించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ శానిటేషన్ ఉద్యోగులతో సమీక్ష జరిపారు. డివిజన్లవారీగా మెరుగైన ఫలితాలు కనపడాలని



కాలువలో వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

ఆదేశించారు.

మాజీ సైనికులకు పన్ను మినహాయింపు ఇవ్వండి

మాజీ సైనికులకు ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలని జిల్లా సైనిక అధికారి జీ హరిక్రిష్ణ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కమిషనర్ కౌన్సిల్లో తీర్మానం చేసి ఉత్తర్వులు అందజేస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు.

ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోండి

● డీఏవో సత్యవాణి

ముత్తుకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ద్వారా గ్రామస్థాయిలో జరిగే ఫార్మర్స్ రిజిస్ట్రేషన్‌ను రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి సూచించారు. మండలంలోని పొట్టెంపాడులో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్రాప్ చేసుకున్న ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. నకిలీలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా దిగుబడి పెంచుకోవచ్చన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని అవసరమైన మోతాదులో ఎరువులు వాడాలన్నారు. అధికారులు, శాస్త్రవేత్తలు వరిసా



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

గులో చేపట్టవలసిన విధానాల గురించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ శివనారాయణ, ఏడీఏ రాజ్‌కుమార్, ఏవో జ్యోత్స్నరాణి, రైతులు పాల్గొన్నారు.

● సంక్షేమ పథకాలను వినియోగించుకోండి

తోటపల్లిగూడూరు: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి శిరీషారెడ్డి తెలిపారు. మండలంలోని గంగపట్నం బిట్-1,2లలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రసన్న, వీపీఏ సుమంత్ పాల్గొన్నారు.

రోడ్ల పక్కన పేడదిబ్బలు తొలగించాలి

మనుబోలు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోడ్ల పక్కన చెత్త, పేడ దిబ్బలు లేకుండా తొలగించాలని పంచాయతీ విస్తరణాధికారి నారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీల్లో తప్పనిసరిగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు పంపాలన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే ఇంటి, కొళాయి పన్నుల వసూళ్లలో చొరవ చూపాలన్నారు.

పీహెచ్‌సీకి అత్యాధునిక వైద్య పరికరాలు

పొదలకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో సుమారు రూ.2 లక్షల విలువైన హైడ్రాలిక్ బెడ్, కాట్-1, వీల్ చైర్-2, ఆపరేషన్ థియేటర్ టేబుల్-1, స్టాండింగ్ బీపీ ఆపరేటస్-1, నార్మల్ బెడ్ కాట్స్-2 పరికరాలు అందజేశారు. బుధవారం వాటిని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నరసింహారావుతో కలిసి ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ (గూడూరు) జి.అరుణ్‌కుమార్, పొదలకూరు మేనేజర్ పీఎస్.రాజు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆర్ఎం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో మహమ్మదాపురం పీహెచ్‌సీకి అత్యాధునిక పరికరాలను అందించిందని, వీటి ద్వారా ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు



మహ్మదాపురం పీహెచ్‌సీకి వైద్య పరికరాలు పంపిణీ చేసిన ఎస్‌బీఐ ఆర్ఎం అరుణ్‌కుమార్, తదితరులు

మెరుగైన సేవలు అందుతాయన్నారు. అనంతరం ఇద్దరు పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు రీజినల్ హెచ్ఆర్ మేనేజర్ వివేక్, వైద్యాధికారులు డాక్టర్ వీక్షిత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతికి పుష్పాంజలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నగరంలోని ప్రగతినగర్‌లో పవర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం 18 అడుగుల శివాజీ కటౌట్‌కు పాలాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించారు. ఛత్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ అధ్యక్షుడు కొగిలి రమేష్ రాజశేఖర్, ముని వెంకటసూర్య, కొగిలి సురేష్‌రాజ్, బాలాజీ, కొండారెడ్డి, శేఖర్, లక్ష్మణ్, వెంకటేష్, బాలయ్య, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



శివాజీ కటౌట్ వద్ద పవర్‌యూత్ సభ్యులు

● బుచ్చిరెడ్డిపాళెం: ఛత్రపతి శివాజీ వర్ధంతి సందర్భంగా మండలంలోని కాగులపాడు సెంటర్ వద్ద ఉన్న జనిపిన్నారి వర్గుసా లెబెన్లో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి వర్గుసా బ్రాంచి మేనేజరు శివాజీ, దివ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సేల్స్ చీఫ్ జనరల్ మేనేజరు, జనరల్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా నక్కా శివయ్య

వెంకటాచలం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరుకు చెందిన నక్కా శివయ్య కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా నియమితులైనట్లు తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురువం బాబు, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరేంద్రలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మండల ఉపాధ్యక్షుడిగా కసుమూరుకు చెందిన చీదిర్ల ఆశోక్‌ను నియమించారు.

బుచ్చి కమిషనర్‌గా బాలకృష్ణ బాధ్యతల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్‌గా డక్కుగుంట బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు కార్పొరేషన్‌లో టీపీఆర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను బుచ్చి కమిషనర్‌గా నియమించి ఇక్కడ కమిషనర్‌గా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని ఆకాశ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని రాష్ట్ర పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బాలకృష్ణ నగర పంచాయతీలో సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.



వైస్‌చైర్మన్ మొర్ల సుప్రజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ బాలకృష్ణ

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

వెంకటాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రతి రైతు ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వానికి విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు సూచించారు. వెంకటాచలంలోని చవటపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ శాఖ అధికారులే రైతుల వద్ద శాంపిల్ సేకరించి నెమ్ము శాతం తేల్చాలన్నారు. కొనుగోలు కేంద్రానికి ఏ రైసు మిల్లర్లు రాకుండా అధికారులే అంతా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, రైతు సంఘాల నేతలు

రైతు సంఘాల నేతలు కోటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, ఈపూరు మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

వెంకటాచలం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అధికారి ఆధికారులు నిర్వహించారు. అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఏఈవో ప్రసాద్, ఎస్ఎస్ సుధీర్‌బాబు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు సన్మానం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ నితిన్‌ను బుధవారం సన్మానించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఆదిత్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ కళాశాలలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చెన్నారెడ్డి నితిన్ ఎన్‌సీసీ ఆర్మీ వింగ్‌లో రిపబ్లిక్ డే క్యాంప్‌లో పాల్గొన్నాడని చెప్పారు. అతను భవిష్యత్తు లో రక్షణ విభాగంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజా ప్రమోద్‌రెడ్డి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ ఎన్ దినేష్, కళాశాల డీన్ రామాంజనేయులురెడ్డి, సుధారాణి, ప్రిన్సిపల్ నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరి శ్రీనివాసులుకు నివాళి



అన్నదానం చేస్తున్న రేవతి, రాము తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొలగమూడి వెంకయ్య స్వామి దేవస్థానం మాజీ కోశాధికారి తాళ్లూరి శ్రీనివాసులు 5వ వర్ధంతిని బుధవారం నగరంలోని తూకుమానుమిట్టలో నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. నవ నిర్మాణ సంఘ అధ్యక్షుడు టీ రాము మాట్లాడుతూ గొలగమూడి ఆలయ నిర్మాణానికి శ్రీనివాసులు చేసిన కృషిని వివరించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కప్పిర శ్రీనివాసులు, రేవతి, ఆర్యూర్ రాము పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు వాటర్ కూలర్ల వితరణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయానికి దివంగత బెజవాడ సుందరరామిరెడ్డి కుమారుడు సునీల్ రెడ్డి రూ.45 వేల విలువైన వాటర్ కూలర్లను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సెంటర్ మోటివేటర్ సాయిరాం పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి శ్రీనివాస కల్యాణోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస కల్యాణ కమిటీ, 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్కా ఆహల్య, సాయి సునీల్ ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతుంది. నగరంలోని నిప్పో ఫ్యాక్టరీ ప్రాంగణంలో జరిగే ఈ వేడుకలకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చన, నేత్ర దర్శనం, తిరుప్పావడ జరుగుతాయని తెలిపారు. 12 గంటల నుంచి 4 గంటల వరకు సర్వదర్శనం, ఆ తర్వాత 5గంటల వరకు సహస్ర దీపాలంకరణ, ఊంజల్‌సేవ, 7గంటలకు సంగీత విభావరి, రాత్రి 10గంటలకు ఏకాంత సేవ జరుగుతాయని పేర్కొన్నారు.

గాంధీ నెవావత్‌కు డాక్టరేట్

వెంకటాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింహపురి యూనివర్శిటీలో మెరైన్ బయాలజీ (సముద్ర జీవ శాస్త్రం) విభాగంలోని పరిశోధన విద్యార్థి గాంధీ నెవావత్‌కు డీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన స్టడీస్ ఆన్ ది మొలెక్యులర్ రెస్పాన్స్ ఆఫ్ మెరైన్ ఫిష్ అండర్ ఐండస్ట్రియల్ గాసెస్ ఎమిషన్స్ అనే అంశంపై అధ్యయనం చేసి సముద్ర జీవశాస్త్రం విభాగంలోని ప్రొఫెసర్ సీహెచ్ విజయ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథం సమర్పించి పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఆయనను రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, పరిశోధకుల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకటాయులు అభినందించారు.

రోస్టర్ తప్పులు సవరించి మెయిన్స్ నిర్వహించాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ విధానంలో తప్పులను సవరించిన తర్వాత గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని మాస్టర్ ఆప్ సోషల్ సొసైటీ నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ బుధవారం నగరంలో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. మెయిన్స్ నోటిఫికేషన్ ఇవ్వక ముందే తప్పులు సవరించాలని ఆ సొసైటీ నాయకులు మస్తాన్, జనార్దన్, ఆశోక్, శ్రీకాంత్, శ్రీనివాసులు, గణేష్ డిమాండ్ చేశారు.

ఏఐతో ఉజ్వల భవిత

● డేటా అనలిస్ట్ సతీష్

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని అమెరికాకు చెందిన డేటా అనలిస్ట్ నరేష్ కొమిరెడ్డి అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కంప్యూటర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ద ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇంపాక్ట్ ఆన్ ఏఐ, ఏఐ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అనంతరం ఏఐ టూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల విధులకు వెసులుబాటు కల్పించాలి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్ష విధులకు సంబంధించి గర్భిణులు, పాలిచ్చే తల్లులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలని బీటీఏ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డీఈవో బాలాజీ రావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్, స్పాట్ వాల్యూయేషన్ విధుల కేటాయింపు సమయంలో ఉపాధ్యాయుల ఇబ్బందులు పడకుండా ఉత్తర్వులివ్వాలని విజ్ఞప్తి చేశారు. అన్నీ పరిశీలించిన తరువాతనే విధులు కేటాయిస్తామని డీఈవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి పీ ఆదినారాయణ, డీ మాల్యాద్రి, వేణుగోపాల్, కార్యదర్శి రఘు తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌ను కలిసిన సీఈవో

నెల్లూరు (సాంస్కృతికం): ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను ఆ సంస్థ సీఈవోగా నియమితులైన మొహమ్మద్ అలీ బుధవారం కలిశారు. నగరంలోని అజీజ్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పలు అంశాలపై చర్చించారు.

కాకుపల్లిలో ఘనంగా 'గడప గడపకు'..

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిర్వహిస్తున్న గడప గడపకు కార్యక్రమం బుధవారం మండలంలోని కాకుపల్లిలో ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్యమే లక్ష్యంగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్దిష్ట సమయంలోపు పరిష్కరిస్తున్నామన్నారు. తమ కుటుంబంపై రూరల్ ప్రజలు పెట్టుకున్న నమ్మకం, చూపుతున్న అభిమానం వెలకట్టలేనిదన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నగర నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి సంభావం తెలిపి గిరిధర్‌రెడ్డితో కలిసి కొన్ని ఇళ్లకు వెళ్లారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేఎన్ఆర్ రియల్టీ అధినేత కుడుముల నాగేశ్వరరావు గౌడ్, సర్పంచ్ కోసూరు సుభాషిణి, మాజీ సర్పంచ్



కాకుపల్లి జంక్షన్‌లో గజమాలతో గిరిధర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఉప్పల ఈశ్వరయ్యగౌడ్, టీడీపీ నాయకులు కోసూరు కేశవులు గౌడ్, శివ పాల్గొన్నారు. 18వ డివిజన్‌లో రూ.74 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, మేయర్ రెడ్డి విజయ భాష్కర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శివారెడ్డి సందర్భంగా కీలాలయాల వద్ద పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.

డిజిటల్ రికార్డుల నమోదుపై అవగాహన

ముత్తుకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు సంఘమిత్ర కార్యాలయంలో బుధవారం వెలుగు వీవోఏలకు డిజిటల్ రికార్డుల నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ మధుసూదనరావు మాట్లాడుతూ దేశమంతా పొదుపు సంఘ రికార్డుల నమూనా ఒకేలా ఉండేలా యాప్ తయారు చేశారన్నారు. ఈ యాప్ వినియోగంపై వీవోఏలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిర్మల, ఏపీవో పెంచలబాబు, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (వైద్యం): వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యుకేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతికి హంస అసోసియేషన్ నేతలు విన్నవించారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో డైరెక్టర్‌ను హంస రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రావు, ఉపాధ్యక్షురాలు అనూరాధ కలిశారు. ఎంపీహెచ్ఎస్, ఎంపీహెచ్ఏలకు ఉద్యోన్నతి కల్పించి హెల్త్ ఎడ్యుకేటర్ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ రద్దు చేయొద్దు

నెల్లూరు (వైద్యం): ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల కార్పొరేషన్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తోందని, ఆ ఆలోచనను విరమించుకోవాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ నరేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీకాస్‌ను రక్షించుకునేందుకు ఉద్యోగులు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సందానీబాషా, శ్రీనివాసులు, రాజేంద్రరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సురేంద్రబాబు, కవిత, అప్రీన్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే భారత్ ధర్మరాజ్యం పార్టీ

నెల్లూరు (సాంస్కృతికం): తన జీవితంలో నిరుపేదల జీవన స్థితిగతులు ప్రత్యక్షంగా చూశానని, వారికి సంక్షేమం - విద్య అందించేందుకు భారత్ ధర్మరాజ్యం పార్టీ స్థాపిస్తున్నట్లు ఆత్మకూరు బాలచంద్రుడు తెలిపారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పార్టీ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పెళ్లూరు రామచంద్రబాబు, ట్రెజరర్‌గా తోట శంకరనారాయణ కలిసి పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు.

'పొదుగాలి'కి పురస్కారం

నెల్లూరు (సాంస్కృతికం): రచయిత ఈతకోట సుబ్బారావు రచించిన పొదుగాలి కథ కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక వారి జాతీయ స్థాయి కథా సంపుటి పురస్కారానికి ఎంపికైంది. 2024లో వెలువడిన 51 కథా సంపుటాలలో పొదుగాలి కథ ఒకటిగా ఎంపికైనట్లు నిర్వాహకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువుల బాబు బుధవారం ప్రకటించారు. రచయిత సుబ్బారావుకు మార్చిలో ప్రొద్దుటూరులో జరిగే సాహిత్య సదస్సులో అవార్డు ప్రదానం చేస్తామని తెలిపారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాతృభాషను గౌరవించి, ఆదరించాలి

● జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మాతృభాషను ప్రతి ఒక్కరు గౌరవించి, ప్రేమించి, ఆదరించాలని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణ కోరారు. మాతృ భాషా దినోత్సవ నేపథ్యంలో బుధవారం నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాతృభాష నేర్చుకున్న తర్వాత మిగిలిన భాషలు ప్రాధాన్యమివ్వాలన్నారు. రష్యా, చైనా, జపాన్‌లో మాతృభాషలో చదివిన వారు ఉన్నత స్థానాలలో ఉన్నారని, శాస్త్రవేత్తలుగా వారికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో పాలనా వ్యవహారాలు మాతృభాషలో సాగించాలని, ఉద్యోగాలలో ప్రోత్సాహం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తెలుగు కవితల పోటీలో ప్రతిభ కనపరచిన మెడికోలకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్



కవితల పోటీలో ప్రతిభ కనబరచి పురస్కారాలు అందుకున్న వైద్య విద్యార్థులు

అజయ్ రొనాల్డ్, హెచ్‌వోడీ డాక్టర్ కన్నన్, రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, భారతి, ములుగు లక్ష్మి మైథిలి తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఎక్స్‌పో చైర్మన్ ప్రసాద్ లాడ్, అంత్యోదయ ప్రతిష్ఠాన్ చైర్‌పర్సన్ నీతాలాడ్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, ఆరణి శ్రీనివాసులు, కురుగొండ్ల రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి

ముగిసిన ఆలయాల సదస్సు

- మూడు రోజుల పాటు ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రసంగాలు, చర్చలు
- ఐటీసీఎక్స్-2025 నిర్వహణతో పెరిగిన తిరునగరి ఖ్యాతి

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైన అంతర్జాతీయ ఆలయాల సదస్సు బుధవారం అంతే ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా హిందూ మతానికి సంబంధించిన ఆలయాలు, సంస్థల నుంచీ పెద్ద సంఖ్యలో ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. ఐటీసీఎక్స్-2025 నిర్వహణకు వేదికగా నిలవడం ద్వారా తిరుపతి ఖ్యాతి మరింత పెరిగింది. దేశవిదేశాల నుంచీ హిందూ సమాజ ఉన్నత స్థాయి వ్యక్తుల రాక సదస్సు స్థాయిని చాటి చెప్పింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వంటి వారి సందేశాలతో సదస్సు ప్రారంభం కాగా దేశంలోనే పేరుమోసిన వారణాసి, అయోధ్య వంటి ఆలయాల నిర్వాహకులు, పలువురు పీఠాధిపతులు రావడం సదస్సుకు నిండుదనాన్ని సంతరించిపెట్టింది. మరోవైపు ఏపీ, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు, పలువురు మంత్రులు, దేవదాయ, పర్యాటక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరు కావడంతో రాజకీయ సందడి నెలకొంది. ఆయా రంగాలకు చెందిన నిష్ణాతులైన ప్రముఖుల ప్రసంగాలు ఆహూతులకు విజ్ఞానాన్ని పంచగా.. సదస్సులో సాగిన చర్చలు ఆసక్తి రేపాయి. అలాగే సదస్సు ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రధానంగా పలు ఆలయాల చరిత్ర, సమాచారాలతో పాటు ఆలయాల నిర్వహణతో ముడిపడిన టెక్నాలజీని పరిచయం చేశాయి.

ఇనుమడించిన తిరుపతి ఖ్యాతి

గతంలో ఏఐసీసీ ప్లీనరీ, ప్రపంచ తెలుగు మహాసభలు, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మహాసభలు వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి సభలు, సమావేశాలకు తిరుపతి వేదికగా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిస్తున్న తిరుపతిలో ఆధ్మాత్మికంగా ఈ స్థాయి కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాలు ఇప్పటి దాకా లేవు. తాజాగా ఐటీసీఎక్స్-2025 సదస్సు నిర్వహణతో ఆ లోటు కూడా పూడినట్టయింది. ఏకంగా 17 దేశాలకు చెందిన 1500కు పైగా పేరున్న ఆలయాల నిర్వాహకులు తిరుపతి వేదికగా మూడు రోజుల పాటు సదస్సులో పాల్గొనడం నగర చరిత్రలో మైలురాయిగా నిలిచిపోనుంది. సదస్సుకు వచ్చిన ప్రతినిధులకు శ్రీవారి దర్శనం కల్పించాలని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు టీటీడీ అధికారులను ఆదేశించడం తెలిసిందే. తిరుమల శ్రీవారిని దర్శించుకునే అవకాశం ముడిపడి వుండడంతో భవిష్యత్తులో కూడా తిరుపతి వేదికగా ఈ తరహా జాతీయ, అంతర్జాతీయ ఆధ్యాత్మిక సదస్సులు మరిన్ని జరిగేందుకు అవకాశమేర్పడుతోంది.

టీటీడీకి పెరిగిన ప్రాధాన్యం

ఈ సదస్సు ద్వారా ప్రత్యేకించి టీటీడీకి ప్రాధాన్యం మరింత పెరిగింది. సదస్సులో అనేక సందర్భాల్లో టీటీడీ ప్రస్తావనకు రావడం గమనార్హం. ఆలయాల నిర్వహణ, పాలనలో టీటీడీ దేశంలోని ఇతర దేవాలయాలకు నమూనాగా మారి మార్గదర్శనం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇదే అంశం సదస్సులో పదేపదే ప్రస్తావనకు వచ్చింది. తాజాగా వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం త్వరలో దాన్ని టీటీడీలో కూడా అమలు చేస్తామని మంత్రి లోకేశ్ చేసిన ప్రకటనతో మరోసారి టీటీడీ సదస్సులో చర్చనీయాంశమైంది.

సదస్సు తీరుపై అసంతృప్తులూ ఉన్నాయ్

తిరుపతిలో ఎంత గొప్పగా ఐటీసీఎక్స్ సదస్సు నిర్వహించినా స్థానికులతో పాటు సామాన్యులకు ప్రవేశం లేకపోవడం అసంతృప్తిని మిగిల్చింది. సదస్సులో అనేక దేశాలకు చెందిన ఆలయాల నిర్వాహకులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, దేశంలోని వివిధ స్థాయిల్లో వున్న వీవీఐపీల రాక కారణంగా భద్రాపరంగా సదస్సు నిర్వహణలో ఆంక్షలు, పరిమితులు ఎక్కువగా కనిపించాయి. కేవలం పాస్ జారీ చేసిన ప్రతినిధులను మాత్రమే పరిమితంగా అనుమతించారు. అందువల్ల సదస్సుకు హాజరు కావాలన్న ఆసక్తి ఎంతోమందికి వున్నా హాజరు కాలేకపోయారు. దానికి తోడు ఈ ప్రాంత ప్రజలకు చిరపరి చిత ు లైన అనేక హిందూ మఠాధిపతులు, పీఠాధిపతులు సదస్సుకు రాకపోవడం కూడా వెలితిగా అనిపించింది. వారిని భాగస్వామ్యం చేసివుంటే బాగుండేదన్న భావన జనంలో కనిపించింది. సదస్సు లక్ష్యం సనాతన ధర్మ వ్యాప్తి, పరిరక్షణ అయినప్పుడు ఇలా పరిమితులతో సదస్సులు నిర్వహిస్తే ఆ లక్ష్యం ఎలా నెరవేరుతుందని, ప్రస్తుత యువతరానికి సదస్సు సందేశం ఎలా చేరుతుందని జనం ప్రశ్నించడం వినిపించింది.

ఇప్పుడు టెన్షన్ లేకుండా చదువుకుంటున్నాం

మంత్రి లోకేశ్ ఎదుట పద్మావతి వర్సిటీ విద్యార్థినుల ఉద్వేగం

ఇంజినీరింగ్ విద్యార్థినులతో మంత్రి ముఖాముఖి





విద్యార్థినులతో లోకేశ్ సెల్ఫీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వస్తాయో.. రావో అనే ఆందోళనతో గత ప్రభుత్వ హయాంలో చదువుపై దృష్టి పెట్టలేకపోయాం. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిల్లేకుండా రియంబర్స్‌మెంట్ జమ చేస్తున్నారు. అందుకే ఎలాంటి టెన్షన్ లేకుండా ఇప్పుడు మేము చదువుకుంటున్నాం' అన్ని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎదుట విద్యార్థినులు చెప్పిన మాటలివి. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలోని బీటెక్ ట్రిపుల్‌ఈ మూడో సంవత్సర విద్యార్థినుల తరగతి గదిని మంత్రి లోకేశ్ సందర్శించారు. బోధనా ప్రమాణాలు ఎలా ఉన్నాయని మంత్రి అడగ్గా.. బాగున్నాయంటూ విద్యార్థినులు చెప్పారు. గత ప్రభుత్వంలోని పెండింగ్ రియంబర్స్‌మెంట్ బకాయిలనూ విడుదల చేస్తామన్నారు. వర్సిటీకి అవసరమైన క్రీడా సామగ్రి సమకూరుస్తామన్నారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్ దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీనిపై విద్యార్థినులు ఆనందం వ్యక్తంచేశారు. మంత్రి లోకేశ్, విద్యార్థినుల మధ్య సంభాషణ..

మేఘన: ఎన్టీఆర్ హయాంలో పద్మావతి యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. మీరు విద్యాశాఖ మంత్రిగా మా తరగతి గదికి వచ్చి సమస్యలు తెలుసుకోవడం ఆనందంగా ఉంది.

విజయలక్ష్మి: ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగావకాశాలు పొందడానికి మరిన్ని కోర్సులు చేయాల్సి ఉంది. ప్రత్యేకంగా కోర్సులు చేయాలంటే పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చవుతోంది. ఆర్థిక స్తోమతలేని నేను ఈ కోర్సులు చేయలేను. అందుకని జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు నిర్వహించాలి. శిక్షణ ఇవ్వాలి.

లోకేశ్: యూనివర్సిటీ విద్యారంగాన్ని మార్పులు తెచ్చి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించేలా చూస్తాం.

మౌనిక: ఉద్యోగాల్లో స్పోర్ట్స్ ప్రియారిటీ ఉంటుంది. చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి.

లోకేశ్: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

రాజకుమారి: హాస్టల్లో అందిస్తున్న ఆహారం సరైన నాణ్యత లేదు. ఈ సమస్యను పరిష్కరించండి.

లోకేశ్: రెండు వారాల్లో నాణ్యత పెంపునకు పటిష్ఠ చర్యలు చేపడతాం.

సలీమ్: యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో సైకాలజిస్టును నియమించాలి.

లోకేశ్: జీవితంలో ఒడిదుడుకులు అధిగమించాలి. నేను గతంలో మంగళగిరిలో ఓడిపోయాను. తర్వాత జనంతో మమేకమయ్యాను. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ కల్గిన మూడవ అసెంబ్లీగా మంగళగిరి నిలిచింది. దీనిని బట్టి ఎన్ని రకాల అవాంతరాలు వచ్చినా గట్టిగా నిలబడి ఎదుర్కోవాలి. సైకాలజిస్టు నియామకంపై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

శిరీష: బీటెక్ పూర్తయ్యేలోపు అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడండి. లైబ్రరీలో మరిన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.

లోకేశ్: ప్లేస్‌మెంట్స్ ఎలాంటి ఢోకా లేదు. కొత్త పరిశ్రమలు రావడంతో ఉపాధికి ఎలాంటి సమస్య ఉండదు.

కాలేజీ, హాస్టల్ సమస్యలు తీర్చాలన్న కొందరు విద్యార్థినుల మాటకు.. తగు పరిష్కారాన్ని వీలైనంత త్వరగా చూపుతామని లోకేశ్ హామీ ఇచ్చారు.

- బీటెక్ ఈఈఈ మూడో సంవత్సరం తరగతి గది వద్దకు వెళ్లిన మంత్రి నారా లోకేశ్.. క్లాస్‌లోని అధ్యాపకురాలి అనుమతి తీసుకొని లోపలకు వెళ్లారు. తనతోపాటు వీసీ, రిజిస్ట్రార్, కలెక్టర్, మీడియా ఉంటే విద్యార్థినులు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకోలేరని భావించి.. అందరినీ బయటకు పంపేశారు.
- ఇంజినీరింగ్ కాలేజీ నుంచీ వెనుదిరిగే క్రమంలో వివిధ సమస్యలపై కొందరు బయటివారూ వినతిపత్రాలతో అక్కడికి వచ్చారు. ఇది యూనివర్సిటీ. ఈ అంశాలకు సంబంధించిన వినతిపత్రాలే ఇవ్వాలన్నారు.
- ఓ విద్యార్థిని కోరిక మేరకు ఆమె తండ్రితో వీడియో కాల్‌లో మంత్రి లోకేశ్ మాట్లాడారు. మీ బిడ్డను బాగా చదివించాలనీ, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

రూ.5 లక్షలతో డ్రోన్ తయారు చేస్తున్నాం

పద్మావతి వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇన్‌క్యూబేటర్ (టీబీఐ), ఐటీ, లైఫ్ సైన్సెస్ ల్యాబ్‌లను మంత్రి లోకేశ్ పరిశీలించారు. 2.5 కిలోమీటర్ల పరిధిలో ప్రయాణించే డ్రోన్‌ను తాము కేవలం రూ.5 లక్షలతో తాము తయారు చేస్తున్నట్టు అక్కడి నిపుణుల తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు గతంలో చేపట్టిన జ్ఞానభేరి కార్యక్రమం సందర్భంగా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. రూ.40 లక్షల దాకా స్టార్టప్‌లకు ఆర్థిక సాయం కూడా చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 26 మందికి ఇచ్చామనీ, త్వరలో మరో 14 మందికి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇన్నోవేషన్స్, స్టార్టప్‌లను ప్రోత్సహించే లక్ష్యంతో పని చేస్తున్నట్టు మంత్రికి వివరించారు. సోలార్ ఫోన్, ఛార్జర్, వాటర్ బాటిల్స్ వ్యర్థాలతో బ్యాగుల తయారీ, అరటి పండు తొక్కతో శాలువా, హెర్బల్ శానిటరీ న్యాప్‌కిన్స్ వంటి ఆవిష్కరణలను మంత్రి పరిశీలించారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం



శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో రూ.7.5 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన అధునాతన ఇండోర్ స్టేడియంను బుధవారం మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన ఏరోబిక్స్, తైక్వాండో, యోగా, ధ్యాన కేంద్రాలను, సబ్ స్టేషన్-3 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి కాసేపు షటిల్ ఆడారు. యూనివర్సిటీలోని క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని కోరారు. ఇటువంటి అధునాతన ఇండోర్ స్టేడియం నిర్మించడం వల్ల క్రీడాకారులకు మంచి ప్రయోజనం కలుగుతుందని క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రీడా సదుపాయాలను విద్యార్థినులు వినియోగించుకోవాలని వీసీ ఉమ, శాప్ చైర్మన్ రవినాయుడు సూచించారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న లోకేశ్, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, వీసీ ఉమ, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఎండీ గిరీషా, కలెక్టర్ వెంకటేశ్వర్, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, బల్లి కళ్యాణ చక్రవర్తి, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, తిరుపతి కమిషనరు మౌర్య, పద్మావతి వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ శారా సరోజిని, పీఆర్వో శ్రీరజని, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తులను మోసగించిన దళారీని విచారించిన పోలీసులు

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనాలు, ఆర్జితసేవలు, వసతి పేరుతో భక్తులను మోసగించిన దళారీని తిరుమల పోలీసులు విచారించారు. బెంగళూరుకు చెందిన ఓ భక్తుడికి అభిషేకం టికెట్లు తీసిస్తానని భీమవరానికి చెందిన రమణప్రసాద్ నమ్మించి రూ.4 లక్షలు వసూలు చేశాడు. మోసపోయిన గ్రహించిన బాధితులు గతేడాది డిసెంబరులో తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న ఈ దళారీని పక్క రాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేశారు. పీటీ వారెంట్ ద్వారా అతడిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు తీసుకొచ్చి విచారించారు. తనకు టీటీడీ అధికారులతో పరిచయాలు ఉన్నాయని, తాను ఏ దర్శనం, సేవనైనా ఇప్పించగలనని కొన్నేళ్లుగా రమణప్రసాద్ భక్తులను నమ్మించి మోసగిస్తున్నాడు. 2018లోనే అతడిపై తిరుమల టూటౌన్‌లో నాలుగు కేసులు, తాజాగా వన్‌టౌన్‌లో మరో కేసు నమోదయ్యాయి. మరో నాలుగు రాష్ట్రాల్లోనూ చీటింగ్ కేసులు ఉన్నట్లు సమాచారం. ఇతర కేసులకు సంబంధించి విచారణ కోసం అతన్ని పోలీసులు ఇతర రాష్ట్ర పోలీసులకు అప్పగించారు.

ఎన్నికల అలవెన్సు రూ.1.40 కోట్లు మంజూరు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి గౌరవ వేతనం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.26.17కోట్లు మంజూరు చేసింది. ఇందులో జిల్లాకు రూ.1.40కోట్లు మంజూరైంది. ఎన్నికలు ముగిసిన 8 నెలల్లో నిధులు మంజూరు చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పేదలను దోచి కార్పొరేట్లకు మేలు చేస్తున్నారు

- కేంద్ర బడ్జెట్‌పై నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పేదలను దోచి కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని, దానికి నిదర్శనమే ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హరికృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకపోగా బడ్జెట్‌లో పేదల నుంచి ముక్కుపిండి వసూలు చేసి, బడా కార్పొరేటర్లకు దోచిపెడుతోందన్నారు. ఈ విషయంలో నిలదీయాల్సిన టీడీపీ, వైసీపీ నోరెత్తకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉపాధి నిధుల్లో కోత పెట్టారని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకుండా ప్రధాని విదేశాల చుట్టూ తిరుగుతుండడం సిగ్గుచేటన్నారు. కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి, కె.రాధాకృష్ణ, ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, టి.సుబ్రమణ్యం, సి.పెంచలయ్య, పి.వెంకటరత్నం, టి.లోకేష్‌రెడ్డి, వేణు, శివ, అరుణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

- రూ.271 కోట్లతో అంచనాలు సిద్ధం -

తిరుపతి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.272కోట్లతో బడ్జెట్ అంచనాలను సిద్ధం చేశారు. గురువారం జరగనున్న కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో కౌన్సిల్ చర్చించనుంది. రెవెన్యూ ఆదాయం రూ.170 కోట్లు, ఖర్చు రూ.116కోట్లు, మూలధన రాబడి రూ.92కోట్లు, ఖర్చు రూ.130 కోట్లకు అంచనా వేశారు. అదేవిధంగా 2024-25 బడ్జెట్ అంచనాలను మేయర్ సవరించారు. బడ్జెట్ సమావేశం అనంతరం జరిగే కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో 41 అంశాలు అజెండాలో చేర్చారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లింపు, తాగునీటి సమస్య పరిష్కారం, వైర్‌లెస్ సెట్ల కొనుగోలు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ, చెత్త సేకరణ, వాహనాల మరమ్మతులకు ఆమోదించనున్నారు. అదేవిధంగా పలు అంశాలను టేబుల్ అజెండాలో చర్చించనున్నట్లు తెలిసింది.

రెండు ట్యాక్సీలపై ఆంక్షల విధింపు

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించిన రెండు ట్యాక్సీలకు సంబంధించి అధికారులు చర్యలు తీసుకురు. తిరుమలలో బుధవారం సాయంత్రం జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, సిబ్బంది ఆకస్మిక వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో పర్మిట్ లేని ఓ టవేరాను, ఇన్సూరెన్స్ లేని మరో సుమోను సీజ్ చేశారు. ఎంవీఐ రూ.15 వేల జరిమానా విధించారు. ఈ వాహనాలపే వారంరోజుల పాటు తిరుమలకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు ఉన్నవారే ట్యాక్సీలను నడపాలని ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్లను ఆదేశించారు.

పద్మావతి వర్సిటీ వీసీ బాధ్యతల స్వీకరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ వెన్నం ఉమ బుధవారం ఉదయం 10:30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. తనను వీసీగా నియమించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సహకారంతో యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. రిజిస్ట్రార్ రజని, పలువురు అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.



భక్తులకు భరోసా టీటీడీ ఫీడ్‌బ్యాక్ బుక్

● మంత్రి వాసంశెట్టి సుభాష్

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయాన్ని సందర్శించే భక్తుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి టీటీడీ ఫీడ్‌బ్యాక్ బుక్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం స్వామిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇది భక్తులకు భరోసా ఇస్తుందన్నారు. 99.6 శాతం పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోందన్నారు. గత ఎనిమిది నెలలుగా శ్రీవారి ప్రసాదాల నాణ్యత పెంపు, పరిశుభ్రత చాలా పకడ్బందీగా జరుగుతోందన్నారు. కాగా శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్ మహాద్వారం గేటు నుంచి కాకుండా బయోమెట్రిక్ నుంచే వెలుపలకు రావడం విశేషం.

→ బయోమెట్రిక్ నుంచి ఆలయం వెలుపలకు వస్తున్న మంత్రి సుభాష్



సురుటుపల్లిలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

నాగలాపురం, ఫిబ్రవరి 19, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ధ్వజస్తంభం వద్ద పంచ మూర్తుల ఉత్సవర్లకు అభిషేకాది కార్యక్రమాలను చేపట్టారు. యాగశాల మండపంలో వృషభయాగం నిర్వహించారు. పూర్ణాహుతి జరిపి నందీశ్వరుడి చిత్రంతో ఏర్పాటు చేసిన ధ్వజపటానికి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి 12 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేశారు. తద్వారా శివరాత్రి ఉత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు.

ధ్వజ పటాన్ని ఎగుర వేస్తున్న అర్చకులు

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.81 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,427

తలనీలాలు సమర్పించినవారు: 21,066



భక్తుల కొంగు బంగారం

శ్రీకాళహస్తిలోనే కాదు భట్లకనువూరులోనూ కాళహస్తీశ్వరుడు కొలువుదీరి నిత్య పూజలందుకుంటున్నాడు. ఆధ్యాత్మిక వెలుగులు పంచుతున్నాడు. 1246లో ఈ దేవాలయాన్ని చోళుల చివరి రాజైన రాజేంద్ర చోళ-3 హయాంలో అరవభూమి రెడ్ల వంశస్తులు నిర్మించారని చెబుతారు. అప్పట్లోనే ఆలయ నిర్వహణకు లోటుపాట్లు రాకుండా 80 ఎకరాల మాన్యాన్ని కేటాయించారు. - ఓజిలి,ఆంధ్రజ్యోతి

శివరాత్రి వేడుకలకు సిద్ధం : ప్రస్తుతం జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తే ఆలయంలో నిత్యారాధనలు,జరుగుతున్నాయి. ఇటీవల త్రైమాస పూజలను ఘనంగా నిర్వహించారు. ఏటా కోనేరులో నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 26న శివరాత్రి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, దేవదాయ అధికారులు, గున్నంరెడ్డి కుటుంబీకులు సంయుక్తంగా కృషి చేస్తున్నారు.

●భట్లకనువూరులో కాళహస్తీశ్వరాలయం



జ్ఞానప్రసూనాంభ సమేత కాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానం

నాలుగేళ్లుగా పూర్వ వైభవం : నాలుగు దశాబ్దాల క్రితం వరకు దేవాలయ నిర్వహణ సజావుగానే కొసాగింది. తర్వాత గ్రామంలో వివిధ పరిణామాల నేపథ్యంలో దేవాలయాన్ని పట్టించుకోలేదు. ధూప,దీప, నైవేద్యం పెట్టేవారే కరువయ్యారు. ఆరాధనలు అటకెక్కాయి. జీర్ణాలయంగా మారిపోయింది. ప్రహరీ గోడలు పడిపోయాయి. ధ్వజస్తంభం విరిగిపోయింది. ఈక్రమంలో నాలుగేళ్ల క్రితం గ్రామస్తులందరూ. ఆలయ నిర్వహణపై దృష్టి పెట్టారు. గ్రామానికి చెందిన గున్నంరెడ్డి కుటుంబీకులతోపాటు మరికొందరు దాతలు ముందుకు వచ్చారు. మాన్యం భూములకు క్రమం తప్పకుండా వేలం నిర్వహించారు. ఏటా రూ.5 లక్షల రాబడికి ఆలయం చేరుకుంది. దాతల సహాయం రూ.1.30 కోట్లతో కాళహస్తీశ్వరాలయానికి పూర్వ వైభవాన్ని తెచ్చారు. ఆలయంలో ప్రాంగణంలో చిన్న దేవాలయాలను సైతం నిర్మించారు. దీంతో దేవదాయ శాఖ సీ కేటగిరీల ఆలయంగా తన పరిధిలోకి తీసుకుంది.

25 రోజుల్లో..

- 148 కిలోల గంజాయి స్వాధీనం
- 225 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్
- బహిరంగంగా మద్యంతాగే వారిపై 2378 కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాదారులు.. ఆకతాయిలు, రౌడీషీటర్లు.. ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగేవారిపై పోలీసులు నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు వారిపై చర్యలు తీసుకుంటూ, కేసులు పెడుతున్నారు. ఇలా గత 25 రోజుల వ్యవధిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసి 148 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 225 మంది రౌడీషీటర్లను ఆయా పోలీసు స్టేషనకుఉ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ గలాటాలు, ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. ఇక తిరుపతితో పాటు చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, పాకాల.. ఇలా పలుచోట్ల శివార్లలో బహిరంగంగా మద్యంతాగే ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. అక్కడ పొదలు, చెట్లు ఉంటే శుభ్రం చేశారు. ఇలాంటి చోట్ల మద్యం తాగితే చర్యలు చేపడతామని హెచ్చరించారు. కాగా, పదే పదే బహిరంగంగా మద్యంతాగుతూ పట్టుబడిన 2378 మందిపై కేసులు నమోదు చేశారు. 372 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 1597 మంది చిరు వ్యాపారులపై న్యూసెన్సు యాక్టు కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది 1686 సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడి చట్టాలపై అవగాహన కల్పించారన్నారు. చట్టాలను అతిక్రమించి ప్రవర్తించిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టండి

● కష్టపడ్డ కార్యకర్తను కాపాడుకుంటాం ● అలకలతో ఏమీ సాధించలేం ● పార్టీ శ్రేణులకు టీడీపీ యువనేత లోకేశ్ దిశానిర్దేశం



తిరుపతి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న లోకేశ్

తిరుపతి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ తొలిసారిగా తిరుపతిలో అర్ధరోజు పాటు పార్టీ శ్రేణుల కోసం కేటాయించారు. బుధవారం తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన కపిలతీర్థం పక్కనున్న పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, పార్టీ సభ్యత్వం, ఓటరు వెరిఫికేషన్, మన టీడీపీ యాప్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యకర్తలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. వారి మాటలను సావధానంగా విన్నారు. గ్రూపు రాజకీయాలు చేస్తున్న నాయకులకు చురకలంటించారు. తిరుపతి నియోజకవర్గంలో ఇప్పటికైనా అలకలు విడిచిపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వం రెండూ అనుసంధానమై ముందుకు పోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తమను గుర్తించడంలేదని చాలామంది తనదృష్టికి తీసుకొస్తున్నారని, సీనియర్లు, జూనియర్లు అని లేకుండా పనిచేసినవారందరినీ సమానంగా గౌరవిస్తామన్నారు. పార్టీలేకపోతే ఇక్కడ మనమెవరూ లేరన్న విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా తిరుపతి నేతలు ఆ విషయం తెలుసుకోవాలన్నారు. అధికారం వచ్చేసింది కదా...తిరుగులేని ధోరణితో ఉండడం సరికాదన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలబడాలన్నారు.. వైసీపీ పెట్టిన అక్రమ కేసులు ఉన్నవారు భయపడొద్దని, త్వరలోనే వాటిని కొట్టివేయడం జరుగుతుందన్నారు. పార్టీ ఏకార్యక్రమం పిలుపునిచ్చినా కలిసికట్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తప్పుచేసిన వైసీపీ వాళ్లకు చట్టప్రకారం శిక్ష ఉంటుందని స్పష్టంచేశారు. ప్రతిపక్షం చేసే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలతో మమేకమైతేనే క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుస్తాయన్న స్పష్టతకు అధిష్ఠానం ఇప్పటికైనా వచ్చిందని పార్టీ శ్రేణులు భావించాయి.

పనికోసం పోతే పార్టీలోకి రమ్మన్నారు

ఏదైనా కాంట్రాక్టు పనులు ఇప్పించమని కూటమి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళితే జనసేన పార్టీలో చేరమని ఒత్తిడిచేశారని, అప్పుడు పనులు కూడా ఇస్తామని చెప్పారని ఓ మహిళా నేత లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. కూటమి పార్టీలు కలిసిమెలిసి ఉండాలని ఇలాంటి వాతావరణం ఉండకూడదని చెప్పినట్టు తెలిసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని పక్కనే ఉన్న ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సూచించినట్లు సమాచారం. ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని, ఒకరిదగ్గరకు వెళితే మరొకరికి కోపం వస్తోందని కార్యకర్తలు వాపోయారు. 'మీ పనితీరు ఏంటో మా దగ్గర ఉంటుంది. మీకు ఏవిధంగా న్యాయం చేయాలో పార్టీ చూసుకుంటుంది' అని భరోసా ఇచ్చారు. 'నరసింహ యాదవ్‌కు రాష్ట్ర పదవి వచ్చింది. రాష్ట్రమంతా తిరగాలి. అందరికీ అందుబాటులో ఉండాలి' అని చెప్పారు.

కార్పొరేటర్లతో సమావేశం

ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం కోసం పనిచేసిన కార్పొరేటర్లు లోకేశ్ కలిశారు. టీడీపీ అభ్యర్థిని ఎన్నుకున్నందుకు అభినందించారు. అందరూ కలసి అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. అందరినీ కలుపుకుని నగరాభివృద్ధికి కృషిచేయాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణకు సూచించారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు మంచివ్యక్తిని డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారని జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని ఈసందర్భంగా చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, రవినాయుడు, మబ్బు దేవనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అంటే అట్లుంటది

'వాట్ సత్యన్న (జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్) తలపై వెంట్రుకలు ఊడిపోయినట్టున్నాయ్? తిరుపతి జిల్లా బాధ్యతలు అంటే అట్లుంటయ్' అని మంత్రి అనగానిని ఉద్దేశించి నారా లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. తాను రెండు జిల్లాల్లో పనిచేసినప్పటికీ తిరుపతి జిల్లాలో పనిచేయడమంటే సవాల్‌గానే ఉందని అనగాని ప్రతిస్పందించడంతో సభలో నవ్వులు విరిశాయి. 'తిరుపతి అంటే అట్లుంటది' అని అక్కడివారు గుసగుసలాడుకోవడం కనిపించింది.



టీడీపీ ఉత్తమ కార్యకర్తల సమావేశంలో అభిప్రాయాలను తెలుసుకుంటున్న లోకేశ్



తుడాపై మంత్రి నారాయణ సమీక్ష

తిరుపతి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అధికారులతో మంత్రి నారాయణ బుధవారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో సమీక్షించారు. తుడాకు వస్తున్న రెవెన్యూ, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదాయపెంపుపై తీసుకోవాల్సిన చర్యలపై దాశానిర్దేశం చేశారు. పీపీపీ విధానంలో భూములను అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడం ద్వారా ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుడా పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను తుడా నుంచి విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. అన్నమయ్య సర్కిల్లో నిర్మిస్తున్న 13 అంతస్థుల తుడా టవర్స్ పనులపైనా మంత్రి ఆరా తీశారు. దానికి సంబంధించిన బ్రోచర్‌ను అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ కమిషనర్ సంపత్ కుమార్, తుడా వీసీ మౌర్య, ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత హాజరయ్యారు.

చిన్నశేష వాహనంపై శ్రీవారి చిద్విలాసం





చిన్నశేష వాహనంపై కల్యాణ వెంకన్న - హంస వాహనంపై సరస్వతీ అలంకరణలో స్వామివారు

చంద్రగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం స్వామివారు ఉదయం చిన్నశేషవాహనం, రాత్రి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తి మురళీకృష్ణుడి అలంకరణలో చిన్నశేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో శోభయమానంగా సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనంపై అధిష్ఠించారు. వృషభ, అశ్వ, గజరాజులు ముందు కదులుతుండగా మేళతాళాలు, మంగళ, కేరళా వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, గోవింద నామ స్మరణల మధ్య స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఉదయం స్నపన తిరుమంజనం సాయంత్రం ఊంజల్ సేవలను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ భట్టర్ నారాయణాచార్యులు, ఏఈవో గోపీనాథ్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి, శేషాచార్యులు, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు...


బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపుపందిర వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామి అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.





వెలుగుల శ్రీకాళహస్తి

జలవినాయకుడి కూడలి వద్ద నటరాజస్వామి విద్యుత్ దీపాలంకరణ - విద్యుత్ దీపాలంకారంతో మెరిసిపోతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం



విద్యుద్దీపాల వెలుగులో శ్రీకాళహస్తి క్షేత్రం మెరిసిపోతోంది. శుక్రవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు మొదలు కానున్న నేపథ్యంలో.. రెండు రోజుల ముందే విద్యుత్తు దీపాల అలంకరణ పూర్తి చేశారు. విద్యుద్దీపాలతో దేవతామూర్తుల కటౌట్లు, పట్టణమంతా శోభాయమానంగా మారింది. ఆలయ పరిసరాలు, స్వర్ణముఖి నదిపై వంతెనలు వెలిగిపోతున్నాయి. ఉత్సవాల అంకురార్పణకు సమయం ఆసన్నం కావడంతో తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తీశ్వరాలయం, శివపార్వతుల విగ్రహాలు - రామసేతు వంతెన వద్ద వినాయకుడి విద్యుత్ దీపాలంకరణ



శివపార్వతులకు పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి మదనపల్లెకు చెందిన రాటకొండ గురుప్రసాద్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. మదనపల్లెలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత రాటకొండ గురుప్రసాద్ ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను అదజేస్తుంటారు. అదే క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల ఆరంభానికి ముందుగా బుధవారం గురుప్రసాద్ దంపతులు శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకుని ఈవో బాపిరెడ్డికి పట్టువస్త్రాలను అందజేశారు. అమ్మవారిపేరుతోనే మదనపల్లెలో డిగ్రీ కళాశాలను నెలకొల్పామని గురుప్రసాద్ తెలిపారు.



అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం

వెంకటగిరి రాజాల కొంగు బంగారం
కాశీవిశ్వేశ్వరాలయం



సాలిగ్రామ స్పటిక శివలింగం - సతీ సమేత నవగ్రహాలు

నాయుడుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని చాకలివీధి (నాటి బ్రాహ్మణుల అగ్రహారం)లో ఉన్న కాశీవిశ్వేశ్వరాలయాన్ని దాదాపు 500 సంవత్సరాల క్రితం వెంకటగిరి రాజాల పాలన ప్రారంభంలో ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. కాశీ నుంచి తెచ్చిన స్పటిక శివలింగాన్ని ఇక్కడ రాజావారు ప్రతిష్ఠించినట్లు పెద్దలు చెబుతున్నారు. పాలాభిషేకం చేసేటప్పుడు(శాలిగ్రామ) శివలింగంపై సహజసిద్ధంగా నామాలు కనిపించడం విశేషం. సతీ సమేత నవగ్రహ శిల్పాలు ఇక్కడి ప్రత్యేకత. ఆలయ ప్రాంగణంలో పెద్ద గజశాల, అశ్వశాలలు ఉండేవి. ప్రస్తుతం మారేడు చెట్టు, పురాతన ఏకస్తంభ ధ్వజం ఉన్నాయి. రాజా కుటుంబీకులతో పాటు ప్రముఖుల రాకపోకలతో కాశీవిశ్వేశ్వరాలయం ఎంతో వైభవాన్ని సంతరించుకొని ఉండేది. కాలక్రమంలో ఆలయ ప్రభ తగ్గినప్పటికీ ప్రస్తుతం నిత్య నైవేద్య పూజలు జరుగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించుకుంటుండటంతో పూర్వ వైభవం సంతరించుకుంది.

మహిళల వసతి గృహాల్లో డీఎస్పీ తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ చెంచుబాబు

తడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు, కాదలూరు ప్రాంతాల్లో ఉన్న మహిళల వసతి గృహాల్లో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాల్లో వసతులు, భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆరా తీశారు. మహిళా ఉద్యోగులు రాత్రి, పగలు విధులకు వెళ్లి వస్తున్న నేపథ్యంలో వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిరంతరం సెక్యూరిటీని అందుబాటులో ఉంచాలని వసతి గృహాల నిర్వాహకులను డీఎస్పీ ఆదేశించారు. మహిళలు బయటకు వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చే సమయాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆకతాయిలతో ఇబ్బందులుంటే వెంటనే పోలీసులు సమాచారం అందించాలన్నారు. డీఎస్పీ వెంట సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ కొండపనాయుడు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

గూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 23, 24 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి శ్రీరాములు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి చేపట్టవలసిన ఆందోళన కార్యక్రమాలపై ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం భవనిర్మాణ కార్మిక సంక్షేమ చట్టంలోని నిధులను ఇతర అవసరాలకు మళ్లించి వినియోగించుకుని కార్మిక సంక్షేమ చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, కాలేషా, శశికుమార్, వెంకటయ్య, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత విద్య



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆనాటి గురువులు నేర్పిన క్రమశిక్షణ, విద్యాబుద్ధులే తమ ఉన్నతికి దోహదపడ్డాయని, వారిరుణాన్ని జన్మజన్మలకూ తీర్చుకుంటామని పూర్వ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కోటలోని షాదీ మంజిల్‌లో బుధవారం స్థానిక ఏవీకెఆర్ ఉన్నత పాఠశాలలో 1980-81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆధ్వర్యంలో సమ్మేళనం జరిగింది. పలు వృత్తుల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై చేరుకొని ఆనాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. ఆడు తూపాడుతూ ఉల్లాసంగా గడిపారు. తాము చదువుకున్న ఉన్నత పాఠశాలకు వాకింగ్ ట్రాక్, విద్యార్థులు సేద తీరేందుకు సిమెంట్ బెంచీలు, క్రీడా ప్రాంగణానికి అవసరమైన సౌకర్యాలను సమకూర్చారు. పాఠశాల చుట్టూ మొక్కలు నాటారు. అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సురేంద్రబాబు, రమణబాబు, సుబ్రహ్మణ్యం, చంద్రప్రసాద్, సురేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణయ్య, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, రామరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన

కోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్‌లను కళాశాల కరస్పాండెంట్ నేదు రుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రణీత్ గత నెల 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని బహుమతులను అందుకున్నాడు. అదేవిధంగా అమరావతిలో జరిగిన గణతంత్ర వేడుకల్లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న గాయత్రి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికృష్ణ పాల్గొని ప్రతిభను చాటారు. బుధవారం ఆ విద్యార్థులను రామ్‌కుమార్‌రెడ్డితో పాటు డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, నావెల్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.

వార్డుల్లో అభివృద్ధిపై దృష్టి పెట్టండి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అభివృద్ధిపై దృష్టి సారించాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య బుధవారం కమిషనర్‌ను కోరారు. బుధవారం కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్ వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఈనెల 21న ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు కోరారు. పలు బహుళజాతి కంపెనీలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

చిట్టమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిల్లమూరు, కలుగుర్తిపాడు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రాజయ్య(40) బుధవారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.... చిల్లమూరు గ్రామానికి చెందిన పల్లం సుబ్రహ్మణ్యం, రాజయ్య పూలతోట నుంచి చిల్లమూరుకు వస్తుండగా కలుగుర్తిపాడు క్రాస్ రోడ్డు వద్ద మరో బైక్ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజయ్య చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ధాన్యం దాచుకునేందుకు చోటేదీ?

- వైసీపీ పాలనలో మార్కెట్ కమిటీలు నిర్వీర్యం
- అక్కరకు రాని రైతు భరోసా కేంద్రాలు
- రైతులకు దోచుకుంటున్న వ్యాపారులు



పొలాల్లోనే ధాన్యం రాశులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం నిల్వ చేసుకొనేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. జాతీయ రహదారులు, ఖాళీ స్థలాలు, పొలాలు ఎక్కడ పడితే అక్కడ ఆరపెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. నియోజకవర్గంలో సూళ్లూరుపేట, నాయుడుపేటలో మార్కెట్ కమిటీలున్నా వాటిని వైసీపీ పాలనలో నిర్వీర్యం చేయడంతో అటువైపు రైతులు కన్నెత్తి చూడటంలేదు. సహకార పరపతి సంఘాలు ఉన్నా రైతులకు ఉపయోగపడడం లేదు. ధాన్యం నిల్వ కోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేసి గోదాముల నిర్మాణాలు చేపట్టినా నిధుల సమస్యలతో పూర్తి కాలేదు. సూళ్లూరుపేట మండలం దామానెల్లూరులో నిర్మించిన గోదాము ప్రారంభానికి నోచుకోలేదు. ఇక రైతు భరోసా కేంద్రాలు అక్కరకు రావడం లేదు. 2019కి ముందు మార్కెట్ కమిటీల్లో పంట ఉత్పత్తులను దాచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు రైతులు అమ్ముకొనేందుకు వెసులుబాటు ఉండేది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ విధానానికి స్వస్తి పలకడంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంట ఉత్పత్తులను దాచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చునని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే వరికోతలు ప్రారంభమైనా ధాన్యం నిల్వ చేసుకొనేందుకు వసతులు కల్పించకపోవడంతో పొలాల్లో ఆరపెట్టుకొని వ్యాపారులు అడిగిన ధరలకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

గూడూరు - తిరుమల బస్సులను పునరుద్ధరించండి: పాశిం



రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి తిరుమలకు బస్సులను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. బుధవారం తిరుపతిలో రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు రైల్వే జంక్షన్ కావడంతో ఉత్తరాధి రాష్ట్రాల నుంచి తిరుమలకు వెళ్లే భక్తులు ఇక్కడ దిగి స్వామి దర్శనానికి వెళుతుంటారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో భక్తుల సౌకర్యార్థం గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు రోజుకు 15కు పైగా ఆర్టీసీ బస్సులను నడిపేవారన్నారు. కొవిడ్ సమయంలో గత వైసీపీ ప్రభుత్వం బస్సు సర్వీసులను రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం గూడూరు రైల్వేస్టేషన్ నుంచి ఒక్క బస్సు సర్వీసు మాత్రమే తిరుపతి వరకు నడుపుతున్నారన్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు తిరుమలకు వెళ్లాలంటే అధిక ధరలను వెచ్చించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గూడూరు రైల్వేస్టేషన్ నుంచి నేరుగా తిరుమలకు బస్సులను పునరుద్ధరించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా పద్మావతి మహిళా యూనివర్సిటీలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభానికి విచ్చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆదాయ పన్ను చెల్లింపులో దళారులను నమ్మొద్దు



సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ వంశీధర్, పక్కన అధికారి మోహన్ కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ఆదాయ పన్ను చెల్లింపులో దళారులను నమ్మి మోసపోవద్దని ఆదాయ పన్ను శాఖ తిరుపతి ఒకటో రేంజ్ అడిషనల్ కమిషనర్ వంశీధర అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వ్యాపారులకు ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, పెద్ద వ్యాపారులని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించడం వల్ల ఎంతో ప్రయోజనకరమన్నారు. వ్యాపార లావాదేవీలను బట్టి ఆన్‌లైన్‌లో పన్ను మొత్తం నమోదు అవుతుందని, దళారుల నమ్మి పన్నులు చెల్లింకపోతే నష్టపోయే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ఆదాయపు పన్నుశాఖ అధికారి మోహన్‌కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, వ్యాపారులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవనోపాధి మెరుగుకు ప్రభుత్వం చర్యలు



చిల్లకూరు చెరువులో చేపపిల్లలను వదులుతున్న తానంకి నానాజీ, మత్స్యశాఖ అధికారులు, సహకార సంఘ సభ్యులు

చిల్లకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చెరువుల్లో చేపలు పట్టుకుని జీవనం సాగించే గిరిజనుల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని టీడీపీ సీనియర్ నేత, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ అన్నారు. బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చిల్లకూరు చెరువులో 1.50లక్షల చేప పిల్లలను వదిలారు. ముందుగా చెరువు వద్ద ఉన్న అమ్మవారి శిలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా 1.50లక్షల చేపపిల్లలను చెరువులో వదలడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు జీవనోపాధి కల్పించడంతో పాటు మత్స్యకార సహకార సంఘాల అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, లీలావతి, రామ్మూర్తి, మల్లికార్జున్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రామకృష్ణ, మత్స్యశాఖ అధికారులు నాగరాజు, రఘుబాబు, వెంకటరమణ, విజయ పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని చెన్నూరు చెరువులో చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, వెంకటేశ్వర్లురాజు, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, వేమకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, మత్స్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక రావిచెరువులో టీడీపీ నాయకులు చేప పిల్లలను వదిలారు. మయూరి శ్యామ్‌యాదవ్, వెంకటేశ్వర్లురాజు, దయాకర్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

కోట: మండలంలోని పెన్నక్కచెరువులో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో 12లక్షల చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, పెన్నక్క చెరువు ఆయకట్టు కమిటీ అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, నారాయణ, ఎఫ్‌బీవో రెడ్యానాయక్, ఫిషరీష్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ - చెన్నై ఎక్స్‌ప్రెస్ నాయుడుపేటలో ఆపాలి



సౌత్ సెంట్రల్ రైల్వే డీసీఎం బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న పేర్నాటి జోసెఫ్, మస్తానయ్య

నాయుడుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - చెన్నై మధ్య నడిచే హైదరాబాదు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు నాయుడుపేట స్టేషన్‌లో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి పేర్నాటి వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం సికింద్రాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే డీసీఎం బాలాజీకి వినతిపత్రం అందజేశారు.

అదుపు తప్పి కారు బోల్తా



పెళ్లకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ చావాలి వద్ద 71వ జాతాయ రహదారిపై అదుపు తప్పి కారు బోల్తా పడింది. స్థానికుల సమాచారం మేరకు.. పాలచ్చూరు గ్రామానికి చెందిన వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేటకు కారులో వెళ్తుండగా ఎగువచావాలి వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతింది. సోమశేఖర్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఇద్దరిపై పోక్సో కేసు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలిక శరీరంలో మార్పులను గమనించిన బాధితురాలి తల్లి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయగా గర్భిణిగా నిర్ధారణ అయింది. బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో నిందితులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రమణ తెలిపారు.

50 కోళ్ల మృత్యువాత

కోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన రఫీ పౌల్ట్రీ ఫామ్‌లో 50 కోళ్లు మృత్యువాత పడ్డాయి. చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి ఉండవచ్చునని వదంతులు వ్యాపించాయి. పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ పౌల్ట్రీ ఫామ్‌ను సందర్శించి చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని చెప్పారు.

రైతులకు పథకాలు పొందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి శిరీష

బాలాయపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలంటే ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని వ్యవసాయశాఖ అధికారిణి శిరీష తెలిపారు. బుధవారం మండలంలోని నిండలి, అలిమిలి, మన్నూరు, బాలాయపల్లి సచివాలయాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. రైతులు ఆధార్ కార్డు, పాస్ పుస్తకాలు తీసుకువెళ్లి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు



చిన్నారులకు విద్యాబోధనపై రూపొందించిన ప్రయోగాలను చూపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

కోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండవ రోజు బుధవారం అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులు జరిగాయి. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ ప్రీస్కూల్‌లో పిల్లల అభివృద్ధి గురించి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. చిన్నారులకు మెదడుకు పదును పెట్టే పలు అంశాలను తమదైన శైలిలో అంగన్‌వాడీ వర్కర్లు రూపొం దించగా, వాటి ద్వారా విద్యాబోధన ఎలా చేయాలో రిసోర్స్ పర్సన్, ఉపాధ్యా యులు, సూపర్ వైజర్లు అవగాహన కల్పించారు.

తడ: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంఈవో మల్లికార్జున్‌రావు పాల్గొని జ్ఞానజ్యోతి కార్యక్రమాల నిర్వహణపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శారదాంబ, ప్రధానోపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివశంకర్

డక్కిలి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించక పోతే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. డక్కిలి మండలంలోని కంథలవారిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐ శివశంకర్ ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని చెప్పారు.

రుణాల లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష



బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అందజేయున్న రాయితీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై బుధవారం వివిధ బ్యాంకుల మేనేజర్లతో ఎంపీడీవో మనోహర్ గౌడ్ సమీక్షించారు. చిట్టమూరు కెనరా బ్యాంక్, మల్లాం, గునపాడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. రుణాల కోసం అందిన దరఖాస్తుల పరిశీలనపై చర్చించారు.

దరఖాస్తుల పరిశీలన

డక్కిలి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ద్వారా అందించే రాయితీ రుణాల కోసం అందిన దరఖాస్తులను ఎంపీడీవో గుణశేఖర్ పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పొదలకూరుకు చెందిన ఎస్వీబీవీడీ డిగ్రీ కళాశాల డైరెక్టర్ నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సాయి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపాలని, విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానాలు చేరుకుంటామన్నారు. లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శ్రావణి, దయాకర్ పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

తడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈవో మల్లికార్జునరావు అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థుల సమావేశం నిర్వహించారు. పరీక్షల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా కష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.